


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :12 సంచిక: 07 హైదరాబాద్ 2012 నవంబర్ పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# అవతారుని 44వ అమరతిధి

అవతారుని 44వ అమరతిధి 2013 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఐతే జనవరి 31 అత్యంత ప్రధానమైన రోజు. ఆ రోజున అవతార్ మెహెర్‌బాబా సమాధి ఎదురుగా మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకు బాబా ప్రేమికులందరూ మౌనం పాటించే సమయమని ప్రత్యేకంగా గుర్తించాలి.

## వసతి సదుపాయం

మెహెరాబాద్‌లో వసతి సౌకర్యం కోరుకునే యాత్రికులు ఒక్కొక్కరికి రూ. 50/- ల చొప్పున నగదును “అమరతిధి డొనేషన్స్” పేరిట పోస్టల్ మనీ ఆర్డరు లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా **మెహెర్‌బాబా ట్రస్టు అడ్రస్సు -**

**‘అమరతిధి డొనేషన్స్”, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర - 414 001. పంపాలి. ఇందుకు ఆఖరు తేది 2013 జనవరి 7.**

ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి సొమ్ము వసూలు చేయరు. ఎలక్ట్రానిక్ మనీఆర్డర్ ద్వారా మీరు “అమరతిధి డొనేషన్స్” పంపుతున్న ఎడల మీ పేరు ప్రక్కనే ఎంతమంది పురుషులు / స్త్రీలు తెలియచేయాలని కోరుతున్నారు. ముందుగా నగదు పంపలేని పక్షంలో 2013 జనవరి 30, 31 తేదీల్లో దిగువ మెహెరాబాద్‌లోని విచారణ కౌంటర్ల వద్ద ఒక్కొక్కరికి రూ. 100/- చొప్పున చెల్లించవలసి ఉంటుందని ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పరుపులు** పరుపుల కాంట్రాక్టరు రెండు రోజుల బసకు ఒక్కొక్క పరుపుకు రూ. 50/- చొప్పున అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం ముందుగా -శ్రీమతి ఉషా.అశోక్ సేట్, బంగ్లా నెం. 93, ఉషాకాల్, ఆనంద్‌నగర్, గుల్‌మొహర్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర - 414 003 కు తగిన నగదును మనీ ఆర్డర్ ద్వారా పంపవలెను.

భజనలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదల్చుకునేవారు,

**శ్రీ మెహెర్‌నాథ్ బి.కల్చూరీ, ట్రస్టీ, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర - 414 001, అనే చిరునామాకు 2012 డిసెంబరు 31వ తేదీ లోగా తెలియజేయాల్సిందిగా కోరుతున్నారు.**

## బాబా సందేశం

బాబా ఎంత అందంగా వున్నారో కదా! అని ఒక ప్రేమికుడు అనగానే, బయటకు బహు అందంగా కనబడుతున్నా, లోపల అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయన్నారు.

నాటి ప్రపంచ పరిస్థితులు ప్రభావమేనని బాబా అన్నారు.

When someone mentioned how wonderful He looked, He said, "I look alright on the outside but on the inside I am like a volcano. The world situation is weighing on Me. Jesus Christ suffered... I suffer."

**– మెహెర్‌బాబా, 1962 అక్టోబరు 31.**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**krishnanandm@yahoo.com**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


1. సంపాదకీయం 5
2. ప్రాక్-పశ్చిమ స్వర్ణోత్సవాలు 6-17
3. మెహెరస్థాన్ స్వర్ణోత్సవ వేడుకలు 18
4. సర్వధర్మాన్ పరిత్యజ్య... 19
5. లార్డ్ మెహెర్ 20-27
6. సప్త వాస్తవాలు 28
7. గుస్తాద్ జీ 29-37
8. మామాటలు
9. ప్రార్థనలు
10. జీవిత సభ్యులు.



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# ఏలూరు బాబా సెంటరు 60వ వార్షికోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సెంటరు 60వ వార్షికోత్సవాన్ని **2012 డిశంబరు 24 సాయంత్రం 6 గంటల నుండి 25 వ తేది మధ్యాహ్నం 1.30 నిముషాల దాకా** ఏర్పాటుచేసినట్లు కార్యదర్శి శ్రీ యు. బాపిరాజు **(93983-24096)** ఒక ప్రకటనలో తెలిపారు.

# నిజామాబాద్‌లో ప్రేమిక సహవాస్

నిజామాబాద్ బాబా సెంటర్‌లో 2012 **డిశంబరు 15 సా.4.30 నుండి డిశంబరు 16 మ. 2.30 వరకూ** మెహెర్ ప్రేమిక రెండ్రోజుల సహవాస్ ఏర్పాటుచేశామనిబాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీ ఎ. జనార్ధనరావు (99087 85774) ఒక ప్రకటనలో తెలిపారు.

# ఢిల్లీ బాబా సెంటర్ 60వ వార్షికోత్సవం

ఢిల్లీ బాబా సెంటర్ 60వ వార్షికోత్సవం - 2012 డిశంబర్ 1 నుండి 3వ తేదీ వరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి శ్రీ మనోజ్ సేథీ ఒక ప్రకటనలో తెలిపారు.

బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతూ, విచ్చేసే బాబా భక్తులకు తగిన ఏర్పాట్లు చేయుటకై తగిన వివరాలను కార్యదర్శికి తక్షణమే తెలియజేయవల్సిందిగా 098101-23853,011-4316900 ఒక ప్రకటనలో కోరారు. - secretary@ambdelhicentre.com.

# తుమ్మపాల ప్రథమ వార్షికోత్సవం

విశాఖ జిల్లాలోని అనకాపల్లికి 10 కిలోమీటర్ల దూరంలో వున్న తుమ్మపాల బాబా కేంద్రం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా 24.12.2012 సా 5 గంటల నుండి 25.12.2012 మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక బాబా సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు, శ్రీ రాపర్తి వెంకటరావు, కార్యదర్శి, శ్రీ ఉరిటి శ్రీనివాసరావు (924787871615, 9704002987) ఒక ప్రకటనలో తెలిపారు.

# యాప్రాల్‌లో ఏకాహం

యాప్రాల్, హైదరాబాద్‌లోని శ్రీ యం. కృష్ణానంద్ ఇంట్లో 2013 ఫిబ్రవరి 10 తెల్లవారుఝామన 5 గంటల నుండి సా. 5 గంటల దాకా మెహెరుని ఏకాహం నిర్వహిస్తున్నట్లు బాబా ప్రేమికులందరూ తప్పక విచ్చేయ్యాలని ఆయన కోరారు.

# సంపాదకీయం సహవాస్ ఆంతర్యం

ప్రాక్ పశ్చిమ సహవాస్ స్వర్ణోత్సవ వేడుకలు 2012 నవంబరులో మెహెరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆనాటి సహవాస్‌కి అంతర్లీనంగా గల ఉద్దేశ్యం ఏమిటో తెలుసుకుందాం.

మెహెరాజాద్‌లో గోడకు తగిలించిన తైలవర్ణ చిత్రం – రెక్కలున్న తెల్లని గుర్రాన్ని బాబా ప్రేమికులు చాలామంది చూసేవుంటారు. ఆ తెల్లని గుర్రం దేనికి సంకేతం? దాని విశిష్టత ఏమిటని పాశ్చాత్య బాబా ప్రేమికురాలు ఐ.వీ డ్యూస్ మెహెరామాయిని అడిగింది. 1962 నవంబరులో పూనేలో జరిగిన ప్రాక్ పశ్చిమ సమావేశాల్లో పాల్గొని తిరిగి ఎవరి ప్రాంతాలకు వారు వెళ్ళబోయే ముందు బాబా పాశ్చాత్యులకు మెహెరాజాద్‌ను సందర్శించే అవకాశం ఇచ్చారు. అలా ఆమె మెహెరాజాద్‌కు వెళ్ళినప్పుడు మెహెరాతో తన మనస్సులోని మాట, ఈ తెల్లని అశ్వం గురించి అడిగే అవకాశం లభించింది. ఇందుకు సమాధానంగా మెహెరా ఏం చెప్పిందో దయచేసి పరిశీలించండి.

ఒక్కొక్క అవతార కాలాన్ని ఒక్కో యుగంగా పిలుస్తారంటూ, ఈ అవతార కాలానికి చిహ్నం తెల్లని అశ్వం అని మెహెరా వివరించింది. మెహెర్‌బాబా మాకేం చెప్పారంటే రామావతారంలో ప్రజలు చాలా సత్యవంతులు. ఆనాటి సమాజం కూడా నేటిలా వుండేది కాదు. ఐతే ఇదే మాదిరిగా ఎల్లకాలం ఉండదని రాముడు తన భక్తులకు, శిష్యులకు చెప్పాడు. అలాగే, కలియుగంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా వుంటాయి. యుద్ధాలు, అలజడులు, అకృత్యాలతో యావత్తు ప్రపంచం అశాంతిగానే వుంటుందని చెప్పారు. ఈ మాట ఆనోట ఈనోట రాముడి శిష్యులందరికీ తెలిసి, వారు భయంతో తమను కలియుగంలో జన్మించకుండా కాపాడమని రాముడిని వేడుకున్నారు. **తత్ఫలితమే మనందరమూ అని మెహెరా చాలా సున్నితంగా ఐవీకి వివరించారు.** ఆపై మెహెరా చిరునవ్వులతో మీకు తెలుసా? ఇందుకోసమే బాబా తన ప్రేమికులనందరినీ ఇక్కడ సమావేశపరిచారు. రోబోయే రోజుల్లో ఏదేని ఆపద సమయాల్లో తన ప్రేమికులను రక్షించడానికి, అలాగే ఈ యుగంలో తన ప్రేమ సందేశాన్ని, నామవ్యాప్తి కోసం ఈస్ట్ –వెస్ట్ సమావేశాలను బాబా ఏర్పాటుచేశారని మెహెరా తెలిపింది. ఈ సమావేశాలలో పాల్గొనడానికి కేవలం బాబా ప్రేమికులే అర్హులు. ఈ సమావేశాలు యావన్మంది ప్రజానీకోసం కాదని బాబా స్పష్టం చేశారు.

1956లో మెహెర్‌బాబా జరిపిన ప్రపంచ పర్యటనలో భాగంగా కొంతమంది విదేశీ ప్రేమికులను వారు ఈ సమావేశాలకు తప్పక **(MUST)** హాజరుకావాలని, బాబా తన పిడికిలి బిగించి గట్టిగా ఎందుకు ఆదేశించారో ఇప్పుడు తెలుస్తోంది.

స్వర్ణోత్సవ వేడుకల సమస్త సమాచారం లోపల పేజీల్లో పరిశీలించండి !! !!!.



సంక్షిప్త నివేదిక

# ప్రాక్ -పశ్చిమ సమావేశం - స్వర్ణోత్సవాలు

**మల్లాది రామారావ్ మెహెరాబాద్ నుంచి.. ..,**

గురుప్రసాద్. ఇలనాటి స్వర్ణోత్సవ వేదిక స్థానం అవతారుడు నడిచిన నేల. అవతార వ్యక్తీకరణ చేస్తున్న మెహెరాబాద్ కొండ. అప్పుడు స్వయంగా అవతారుడే పంపాడు ఆహ్వానాలు తానెన్నుకొన్న అయిదు వేల మందికి. వారి బస ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించాడు. దర్శన సమయాలు నిర్ణయించాడు. ఇప్పుడూ అంతే. స్వయంగా ప్రభువు చేసినవే వేడుక ఏర్పాట్లు. అవతారుని ఇచ్ఛ, ప్రేరణ లేనిదే ఏపనీ జరగదు. అదీ ముఖ్యంగా మెహెరాబాద్ కొండపైన. ఇందుకు ప్రబల తార్కాణం - ప్రాక్ - పశ్చిమ సమ్మేళనపు స్వర్ణోత్సవమే. మామూలు రోజుల్లో కొండపై క్యూ ఏర్పాట్లు, ఉదయం, సాయంత్రం ప్రార్థన భజన ప్రసాదం ఏర్పాట్లలో ఏదోఒక లోట్టొచ్చినట్లు కనిపించే మెహెరాబాద్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నభూతో నభవిష్యతి అన్న రీతిలో జరిగాయి అంటే, ప్రభువు ఇచ్ఛ తప్ప మరేదీ కారణం కాదు. నిరుడు ఇదే రోజుల్లో అవతారుని వారసత్వం అన్న అంశంపై జరిగిన రెండు మూడు రోజుల గోష్ఠి చూసి, బెదిరిపోయిన వారికి, ఈ నవంబరు ఒకటి - నాలుగు తేదీల్లో జరిగిన కార్యక్రమం ఊరటనివ్వటమే కాదు, అదొక అనిర్వచనీయమైన అనుభూతి - మాటలకందని అనుభూతి. ముఖ్యంగా యాభయి ఏళ్ళ క్రిందట మెహెరు

నామం చెవిని పడని వారికీ, ఒకవేళ విన్నా విననట్లు పట్టించుకోని వారికీ, తెలిసి వచ్చింది ఈ నాలుగు రోజుల్లో తామేమి కోల్పోయారో. తాజమహాల్ చూసినవాళ్ళు, చూడనివాళ్ళు అని ప్రపంచ ప్రజానీకాన్ని రెండు వర్గాలుగా ఎలా చెప్తారో, 1962 నవంబరు, 2012 నవంబరులకి ముందూ, ఆ తర్వాత అనీ బాబా ప్రేమికలోకాన్ని రెండు వర్గాలుగా చేయవచ్చు. ముందువారు అదృష్టవంతులయితే కావచ్చు. ఇప్పటికయినా మా బాబా కొంగు మాకు దొరికిందని ఈ తరం వారు సంబరపడవచ్చు. ఎందుకంటే, బాబావారి పిలుపుపై అప్పట్లో ఐదు వేల మంది బాబావారిని దర్శించి, తరిస్తే, ఈసారి పట్టుమని రెండు వేల మందికి కూడా దక్కలేదు ఆ అదృష్టం. అలనాడు అంటే, 1962 నవంబరు 1న దర్శనార్థం వచ్చిన ప్రేమికలోకాన్ని కుంభవృష్టిలో తడిపి, సంస్కారవంతులని చేశారు బాబా.

ఇలనాడు అంటే 2012 నవంబరు రెండవ తేదీ సాయంత్రం, మీకోసమే నేను వస్తున్నా ప్రతిసారీ అని చెప్పుతున్నట్లు చిరుజల్లు కురిపించి వేదిక ముందున్న అందర్నీ పునీతులని చేశారు మెహెరుడు. వర్షపు జల్లు కురవడానికి కొంచెం ముందు ఆకాశంలో రంగుల ఇంద్రధనస్సు దర్శనమిచ్చింది. మొదట్లో ఎక్కడో దూరాన వున్నట్లు అనిపించినా రాను రాను సమాధి వెనకనే నిలబడింది ఆ రంగుల హరివిల్లు. బహుశా తమకిష్టమైన మధుసూదన్ పాట – 'మెహెర్ ఏకం'తో కార్యక్రమాలకి శుభారంభం కావటం బాబావారికి ఆనందం కల్గించివుండాలి.

1962 నవంబరులో తొలిసారి పాడాడు మధుసూదన్ ఆ పాటని. "మెహెర్ ఏకం, మెహెర్ నిత్యం", ఎంతగా నచ్చిందీ మండలివారికి ముఖ్యంగా మెహెరాకి అంటే వెంటనే అందరి పేర్లు ఈరుచ్‌అం, పాద్రీఅం, భావూఅం, మణిఅం అంటూ ఒకరినొకరు పలకరించుకొన్నారని ఆనాటి విద్యార్థి – కార్యకర్త, ఈనాటి విద్యావేత్త దిగంబర్ గాడేకర్ వెల్లడించారు.

ప్రాక్ పశ్చిమ ప్రేమిక సమ్మేళనానికి ఎప్పుడూ ఆటంకాలు తప్పవేమో అనాలి. ఎందుకంటే, 1962 నవంబరు నాటికి అమెరికా – రష్యాల మధ్య క్యూబా విషయమై యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. భారత దేశంపై చైనా కాలు రువ్వింది. ఈ రెండు సంక్షోభాల మధ్య ప్రపంచపు గతి ఎలా మారుతుందో నన్న బెంగ పట్టుకొన్నవారికి బాబావారు ఊరట కల్గించారు. నేనుండగా మీకెందుకు చింత అన్నారు. ఆ బరువు బాధ్యత తమపైనే వేసుకొన్నారు. దాంతో బాబావారి ఆరోగ్యం క్షీణించింది. ప్రాక్ పశ్చిమ సమ్మేళనం జరగదేమో నన్న సందేహం మండలికి కల్గింది. వారి మాటని నమ్మని బొంబాయి ప్రేమికలోకం, మండలివారిని తప్పుపట్టింది. బాబాను కనపడకుండా దాచిపెడ్తున్నారని మండలిని నిలదీసింది అని అప్పటి మధ్య వయస్కులు ఇప్పటి వృద్ధులు వేదికపరంగానే చెప్పారు. ఇహ రేపు సమావేశాలు ప్రారంభమవుతాయనగా బాబావారు కోలుకొన్నారని



వివరించారు. బయటికి నేను బాగానే కన్పిస్తున్నా, నాలో ఎన్నో అగ్ని పర్వతాలు భగభగ మండుతున్నాయి. ఇదంతా ప్రపంచ భారం నాపై వుండటం వల్లనే అని బాబావారే స్వయంగా చెప్పారు అడిల్ వాల్కిన్ అనే అమెరికా ప్రేమికుడికి.

ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొంది ప్రపంచం యావత్తు. ముఖ్యంగా ఐరోపా దేశాలు అప్పుల భారంతో కృంగిపోతున్నాయి. అమెరికాలోని నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో లాగా విదేశీయులకి స్వాగతం చెప్పటం లేదు. మధ్య ఆసియాలోనూ పరిస్థితి క్లిష్టంగానేవుంది. మనదేశంలోనూ ఆర్థిక, రాజకీయ స్థితిగతులు అంత మెరుగ్గాలేవు. అంటే, ఒక విధంగా చెప్పాలంటే 1962 నాటి మాదిరిగానే వుంది నేటి పరిస్థితి. ఈ విషమ ఘడియల నుంచి మానవాళి ఎలా బయటపడుతుందో బాబావారి కార్య ప్రణాళిక ఎలా వుంటుందో మున్ముందు తెలుస్తుంది. కాస్తంత సహనం, మరి కాస్తంత నమ్మకం, ఈ రెండింటినీ మించి బాబా ఇచ్ఛకి కట్టుబడి వుండాలన్న మనోనిబ్బరం అవసరం ప్రేమిక లోకానికి. ఎందుకంటే, ఈ సంక్షోభాల నడుమ నుంచే కొత్త మానవాళికి పుట్టుకు వస్తుందని బాబావారు చెప్పకనే చెప్పారు. స్వర్ణోత్సవ వేడుకల్లో పలువురు వక్తలు చెప్పినట్లు, తూర్పు దేశాల్లోని తాత్విక చింతననీ, పశ్చిమ దేశాల శాస్త్రీయ దృక్పదాన్నీ మేళవించడమే ధ్యేయంగా ప్రాక్ పశ్చిమ సమ్మేళనాన్ని బాబావారు ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల కోసం మెహెరాజాద్ నుంచి బయలుదేరే ముందు సోదరి మణి గారిని పిలిచి బాబావారు చెప్పారుట, మీ దగ్గరున్న బట్టలన్నింటినీ పట్టుకురమ్మని. ఎందుకని ఏనాడూ తన అన్న గారిని అడగని ఆ సోదరి చెప్పిన ప్రకారమే చేసింది. నవంబరు ఒకటవ తేదీ వర్షంలో

తడిసిన విదేశీ ప్రేమికులను మణి తెచ్చిన బట్టలే దిక్కయ్యాయి. అలా కొత్త మానవాళికి బాబావారు స్వయంగా స్వాగతం పలికారనాలి. స్వర్ణోత్సవ వేడుకలని లాంఛనంగా ప్రారంభించిన భావూ కల్చూరి గారి మాటల్లో చెప్పాలంటే, బాబా పాదాలకి అర్పితం కావడంతోనే కొత్త మానవాళి పుడుతుంది. సందేశాల ద్వారా భగవత్ప్రేమ పెల్లుబుకదు. శరణాగతి వల్లనే భగవంతుడి దగ్గరయ్యేది. శరణు అంటే ఏదో తూతూ మాత్రం కాదు. మనసా వాచా, కర్మణా శరణు కోరాలి. బుర్రకి పని చెప్పకూడదు, మనస్సుకి పని చెప్పాలి. అప్పుడే, బాబాకి దగ్గరవుతాము. ప్రభువుకి ఉపయుక్తమవుతాము. నేను ఎన్నో పుస్తకాలు వ్రాశాను, ఏం వ్రాశానో కూడా గుర్తులేదు. నేను కూర్చొని వ్రాసిన పుస్తకాల గదికి తాళం వేసి వుందీనాడు. ఆ తాళం చెవి మేర్వాన్ దగ్గర వుంది అని భావూ అన్నారు. మేర్వాన్ అంటే మెహెరుడు ఒకరకంగా, ఇంకోరకంగా చూస్తే, మేర్వాన్ జెస్సావాలా – ఏరుచ్ తమ్ముడు. ఆయన దగ్గరే మెహెరాజాద్ గదుల తాళం చెవులున్నాయి.

యాభయి ఏళ్ళయినా మెహెర్ ప్రేమిక లోకంలో మారని మరో సంగతి – విదేశీయులకి పెద్దపీట వేయటం. ఈతూరి రెండు వదల మందికి పైగా అమెరికన్ సూఫీలు వచ్చారు. బాబా నామ జపంతో, బాబా గానాంమృతంతో అందర్నీ అలరించారు. వారికి వేదిక ముందు

## తెలుగువారు 10 మంది

1962లో పూనేలోని గురుప్రసాద్‌లో జరిగిన ప్రాక్ పశ్చిమ సమావేశాలలో పాల్గొన్న వారిలో సుమారు 40 మంది మెహెరాబాద్‌లో జరిగిన స్వర్ణోత్సవాల్లో వారి వారి అనుభవాలు పంచుకున్నారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు 10 మంది ఉన్నారు.

శ్రీ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ – బాబా మా అందరితో బాగా నిద్ర పట్టిందా అని అడిగారు. ఇంతలో ఒక ప్రేమికుడు "బాబా మీకు నిద్రపట్టిందా ?" అని అడిగాడు. "నేను నిద్రపోతే 700 సంవత్సరాల వరకు లేవనన్నారని ఆయన అందరినీ నవ్వించారు.

**నోరి సోదరులు:** ఈ సమావేశాలకు సుమారు 5 వేల పైచిలుకు అనేక ప్రాంతాల నుంచి వచ్చారు. మేమయితే ఈ సమావేశంలో చిట్ట చివరి వరుసలో ఉన్నాం. ఇది చూసి నేను మా తమ్మునితో మనకు ఈ రోజు బాబా దర్శనం దొరకటం దుర్లభం అన్నట్లు చాలా చిన్నగానే అన్నాను. ఇంతలో ఎంతో దూరంలో వున్న వేదికపై నుంచి ఏరుచ్ మైకులో అనౌన్సుచేస్తూ "చివర వరుసలో వున్న వారికి దర్శనం దొరకదని అనుమానం వద్దు. అందరికీ ఈ రోజే దొరుకుతుంది అని బాబా చెప్పమన్నారని ప్రకటించాడు. బాబా సర్వజ్ఞుడు కదా అని శ్రీ నోరి అన్నారు. – సంచారి

వరసల్లోనే చోటు ఇచ్చారు. భావూ కల్చూరి కుమార్తె షీలా ఫెన్‌స్టర్ సహా చాలా మంది ప్రేమికులు, గత స్మరణచేస్తూ, 1962లో అమెరికన్లకి ముందు కుర్చీలు వేశారు. అవి కుషన్ కుర్చీలు. మనవాళ్ళకి వెనుక వరసలో ఇనప కుర్చీలు వేశారు. ఇదేమిటి బాబా! ఇది న్యాయమా అని మనసులోనే అనుకొన్నాము. మా మాట బాబావారు విన్నట్లుంది. వెంటనే మైక్‌లో ప్రకటన వినిపించింది. ఈ వేళ ముందు వరుస వారు రేపు వెనక్కి వెళ్ళాలి. వెనుక కూర్చొన్నవారు ముందుకు రావాలి. ఇలా రోజూ జరుగుతుంది. ఇదీ ఆ ప్రకటన సారం అని షీలా అన్నారు. మెహెరాబాద్‌లో ఆ ప్రకటన అవసరం రాలేదు. ఎందుకంటే 1962లో బాబాని దర్శించినవారు ప్రత్యేక ఆహ్వానితులుగా విదేశీయుల సరసన కూర్చొన్నారు.

విదేశీయులకి పెద్దపీట వేయడానికి కారణముందంటారు కొందరు పెద్దలు. భారతీయుల కంటే ఎక్కువ కష్టనష్టాలని ఓర్చి వారు వస్తున్నారు. మనలాగ వాళ్ళకి వందల దేవుళ్ళు లేరు. అందువల్ల వారికి బాబావారిపై గురి త్వరగా కుదుర్తోంది అని వ్యాఖ్యానిస్తున్నారు. నిజం బాబావారికే తెలియాలి. వర్తమానానికి వస్తే, 1962 నాటి పర్వ వర్దిగార్ ప్రార్ధన హరికెన్మోర్ చేశారు. ఒక్కొక్కమాట ఉరుములు ఉరిమినట్లు వున్నాయట. ఆయన ప్రార్ధన పూర్తయ్యే సరికి ఆకాశంలో మేఘాలు వచ్చాయట. కాస్సేపటికే వర్షం మొదలయిందిట. ఈసారి ప్రార్ధన ఏలెన్ వాగనెర్ చేశారు. కంచుగొంతుక ఈయనది కూడా. అందరికీ హరికెన్మోర్‌ని గుర్తు చేశారు. అప్పటిలోలాగ వర్షం వస్తుందేమో జాగ్రత్త అని చమత్కరించారు కొందరు వక్తలు.

**"వారి తండ్రి ఇంటిలో" (IN THE HOUSE OF THEIR FATHER)**

అన్న బాబ్ ఫ్రెడెరిక్స్ సినిమా స్వర్ణోత్సవాలకే హైలెట్. అమెరికన్ సూఫీల సహకారంతో మునుపెన్నడూ చూపించని దృశ్యాలతో రూపొందిన సినిమా ఇది. రెండు భాగాలుగా ప్రదర్శించారు. 1962లో బాబాను దర్శించిన వారితో ఇంటర్వ్యూలు, వీనులకి విందైన సంగీతం, అన్నింటినీ మించి 1962 నాటి దర్శన విశేషాలు బాబ్ సినిమా ప్రేక్షకుల్ని మైమరిపించింది.

**నవంబరు 1:** అప్పుడు నేనో కార్యకర్తని అంటూ జాల్ దస్తూర్ స్వాగతోపన్యాసం మొదలుపెట్టారు. సభాస్థలి వైపుగా వెడ్తుంటే, ఏరుచ్ పిలిచారు వెళ్ళాను. ఇక్కడ ఎవరూ వుండటానికి వీల్లేదు. అందరూ వెళ్ళిపోవాలని బాబా అంటున్నారు అన్నాడాయన. సరే అన్నాను. తోటమాలి కూడా వుండకూడదన్నారు బాబా. అంతే 10 – 15 నిముషాల్లో సభా ప్రాంగణం ఖాళీ అయిందనిపించారు. ఇంకో మాట, వర్షం పడింది ఆవాళ. జనం వెళ్ళిపోయారని చెప్పటానికి వెళ్ళాను బాబా దగ్గరకి. బాబా ఏమన్నారో తెలుసా! పంపేశావా నువ్వు అని నిలదీశారు. వర్షం తాళం చెవి నీదగ్గర వుంది. ఆ తాళం తిప్పితే వర్షం ఆగిపోయేది కదా అన్నారు. నాకు నోట మాట రాలేదు. బాబా! నా దగ్గరేమిటి! తాళం

చెవి వుండటవేమిటి! అందరి తాళం చెవీ మీ దగ్గరే వుంది కదా అన్నాను. ఇప్పుడు ఇక్కడి మెహెరాబాద్ సంగతే తీసుకోండి. వర్షం తక్కువ పడింది ఈ ఏడాది. ఎందుకో తెలుసు కదా! బాబా తాళం పూర్తిగా తిప్పలేదు. అందుకే కాస్తంత వర్షం పడింది. బాబా ఎక్కువ వర్షం పడేలా చేస్తారని ఆశిద్దాం, ప్రార్థన చేద్దాం అని జాల్ తమ ఉపన్యాసం ముగించారు.

నాలుగు రోజులు కార్యక్రమ విశేషాలని వివరించారు శ్రీధర్ కేల్కర్. స్వర్ణోత్సవ సంబరాలకి రెండేళ్ళ క్రిందట శ్రీకారం చుట్టామన్నారు. తమతో పని చేస్తున్న వ్యక్తి ప్రోద్బలం వల్లనే 1962 నాటి దర్శనం తనకి దొరికిందన్నారాయన. నాలుగేళ్ళ తర్వాత వారిద్దరూ దంపతులయ్యారు.

1962 నాటి అనుభవాలని ఎనిమిది మంది వివరించారు. మెహెర్‌వాన్ జెస్సావాలా, హోషాంగ్ దాదా ఛాన్జీ, సానియా హమాడి, జోన్

## పెద్ద వాన

శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్ (80), హైదరాబాద్, మెహెర్‌బాబాను నవంబర్ 1955లో దర్శించుకున్నారు. ఆ దరిమిలా ఫిబ్రవరి 1958లో, నవంబరు 1962లో పూనేలో జరిగిన ఈస్ట్ - వెస్ట్ సమావేశాలకు హాజరయ్యారు. ఇటీవల మెహెరాబాద్‌లో నిర్వహించిన ఈస్ట్ - వెస్ట్ సమావేశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరుకాలేకపోయారు. ఐతే, మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధి వారింటికి వెళ్ళి - ఆ సమావేశాల్లో వారి మనస్సుకు బాగా హత్తుకున్న విషయం చెప్పమనగానే శ్రీ జగన్నాథ్ ఇలా అన్నారు. ఆనాడు మేం విజయవాడ నుంచి పూనే వెళ్ళాం. మొదటి రోజున 'కుంభవృష్టి. ఆ పెద్ద వానలో అందరం పూర్తిగా తడిసిపోయాం. చంటి పిల్లలు కూడా ఎందరో ఆ వానలో తడిసి పోయారు. ఐనా కూడా వారు చిన్న చప్పుడు కూడా చేయలేదు. అంతక్రితమే త్వరగా దర్శనం చేసుకోండన్నట్లు బాబా సంజ్ఞలు చేశారు. అదేదో క్యూలో నడుస్తున్న వారిని తొందరచేయడమని అనుకున్నాం కానీ, అంతలోనే పెద్ద వానవస్తుందని ఎవరూ ఊహించలేదు. అందరం తడిసి ముద్దయిపోయాం.

భారతీయ సంప్రదాయం ప్రకారం భగవంతుని దగ్గరకి వెళ్ళే ముందర నదీ స్నానం చేయడం లేదా దగ్గర్లోని కోనేరులో మునిగి వెళ్ళడం మన ఆచారం. ఐతే ఈ సమావేశాల తొలిరోజున అవతారుని సమక్షంలో నిండా తడిసిన మాకు ఆ పవిత్ర నదీ స్నానం లభించినట్లయిందని నేడు నాకనిపిస్తోందన్నారు శ్రీ జగన్నాథ్.

ఆ మర్నాడు ఎవరికయినా జలుబు చేసిందా? అని బాబా వాకబు చేశారు. ఒక్కరు కూడా తపీ మని తుమ్మలేదని జగన్నాథం వివరించారు.

"ఇంత వరకు వున్న మీలో వున్న సంస్కారాలను ఈ వర్షంతో కడిగివేస్తున్నానన్నారు బాబా. రేపటి నుండి మీకు మీరే బాధ్యులని బాబా హెచ్చరించారు".

దిమ్‌ప్లి, టెక్స్ హైటవర్, బెర్నార్డ్ బ్రూఫోర్డ్, ఖాలిద్ అల్‌ఫకీ, ఆలీ రమ్జూ అబ్దుల్లా గతస్మరణ చేశారు. బర్నార్డ్‌కి అప్పుడు 19 ఏళ్ళు. సుమధుర క్షణాలవి అన్నాడు. సూఫీల వెంట వచ్చిన చిన్నారి సానియా, బాబావారు మాతో మాట్లాడుతున్న అనుభూతి కల్గింది అందామె. వర్షం పడుతున్నా ఎవరూ కదల లేదు సరికదా, ఆనందంగా వర్షంలో తడిసి జన్మ ధన్యమయిందనుకొన్నాము. బాబా మాకేసి చూడగానే అలుపు సలుపు మాయమయినాయి. కొత్త హుషారు వచ్చింది అని చెప్పిందావిడ. దాదా చాన్జీకి కార్యకర్తలు ఎలా పనిచేయాలో తెలిసిందట అప్పుడు. బాబావారు ఏపని చేసినా చాలా పకడ్బందీగా చేస్తారు. ఏ చిన్న సంగతీ వదలరు. అన్నీ ఓ ప్రణాళిక ప్రకారం చేస్తారు. ఇందుకు ప్రాక్ – పశ్చిమ ప్రేమిక సమ్మేళనపు ఏర్పాటే నిదర్శనం అన్నారాయన. ఈ కార్యక్రమం ద్వారా బాబావారు తమ విశ్వ కార్యక్రమం నిర్వహించారు. బాబావారన్న ప్రతిమాట నిజమయి తీరుతుంది. ఇది నా నమ్మకమే కాదు, స్వానుభవం కూడా అన్నారు.

క్రీగంటి చూపులో నా జన్మ ధన్యం చేశారు బాబా! అని టెక్స్ హైటవర్ అన్నాడు. ఏదీ ఆశించకూడదు బాబావారి నుంచి నన్ను ముందే హెచ్చరించారు. కానీ ఏం జరిగిందో తెలుసా. బాబావారి దగ్గరకి వెడుతుంటే నాకేసి చూశారు ఒక్కసారి. రెప్పపాటు కాలంలో నా జీవిత గతిని మార్చారు. నాకేది అవసరమనుకొన్నారో అన్నీ ఆ రెప్పపాటు కాలంలో ప్రధానం చేశారు అని చెప్పాడు.

పదేళ్ళ చిన్న పిల్లగా జోన్ బాబాని దర్శించింది తొలిసారి 60 మంది పశ్చిమ స్త్రీలతో కలిసి వచ్చింది. హరికేన్ మోర్ ప్రార్ధన చేస్తుంటే దడ పుట్టింది. బాబా ఎంత గట్టిగా ఉరుములు ఉరిమినట్లు ప్రార్ధన చేస్తున్నాడనిపించింది. బాబాని దర్శించగానే, మా ఇంటికి వచ్చానన్న భావన కల్గింది అన్నదామె.

బాబావారు ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలకరించిన తీరు, యోగ క్షేమాలు కనుగొన్న వైనం, నిద్ర బాగా పట్టిందా, ఒంటిలో ఎలా వుంది అని అడగటం నా హృదయ ఫలకంపై చెరగని ముద్ర వేశాయన్నాడు ఖాలిద్ అల్ ఫక్రి.

మేర్వాన్ జెస్సావాలా కూడా వాలంటీరుగానే పనిచేశాడు. అదొక అదృష్టం అంటాడాయన. మెహెరుని అవతారునిగా స్వీకరించే మహద్భాగ్యం మనకి కలిగింది. మనకా అదృష్టం కల్గించిందీ ప్రభువే అంటూ, అప్పటి ఎన్ని సంగతులో వివరించాడు.

ఘూనా భజన మండలి వారి పాటలు సూఫీల వాయిద్య గోష్ఠి, పాటలు, నృత్యం – మధ్యాహ్నం విశేషాలు. చీకటి పడ్తుంటే, ఆరతి ఇచ్చారు. తదనంతరం – భాబ్ ఫెడెరిక్స్ రూపొందించిన **వారి తండ్రి ఇంటిలో** సినిమా మొదటి భాగం ప్రదర్శించారు.

**రెండవ రోజు, నవంబరు 2:**

ఈవేళ్టి గోష్ఠి ప్రధాన వక్తలు అందరూ తెలుగు పెద్దలే. మెహెర్ చంద్‌నోరి, ఎన్.వి.వి. సత్యనారాయణ, బందరు సీతమ్మ గారు, కోటీ నోరి సోదరులు, చింతా సాయిబాబా,

యాగంటి సుబ్బయ్య, ప్రభృతులు చెప్పింది ఒక్కటే – అలనాటి సంగతులు ఏమని చెప్పగలం. బాబా ప్రేమకి నోచుకొన్నాము. అంతే చాలు.

మెహెర్ చంద్‌కి పట్టుమని తొమ్మిది ఏళ్ళు లేవు అప్పుడు. కానీ జ్ఞాపకాలు స్పష్టంగా, విస్పష్టంగా వున్నాయి. ముఖ్యంగా అప్పుడు విన్న "బోలో, బోలో, బైబై బోలో", "ఇసుమంత ప్రేమ", "కలవరమే...," "మెహెర్ ఏకం" పాటలు ఇప్పటికీ నా చెవుల్లో రింగ్ రింగ్ మంటున్నాయన్నాడీయనగారు. చింతా సాయిబాబా తమ తల్లి మంగాయమ్మ గారి మాటల్ని తమ నోట వినిపించాడు. ఆకలి, నిద్ర లేవు బాబావారిని చూస్తుంటే, వర్షం పడుతున్నా ఎవరూ కదల్లేదు. కళ్ళ ముందు కదుల్తున్నాయి సంఘటనలు అన్నారు మంగాయమ్మ గారు.




ఈస్ట్ – వెస్ట్ సహవాస్ ఏర్పాటు గురించి మెహెర్‌బాబా మంజిల్–ఇ–మీం రోజుల్లోనే అంటే 1920వ దశకంలోనే ప్రస్తావించారు. ఆ దరిమిలా పలు సందర్భాలలో పేర్కొన్నా, బాబా తన అమెరికా దేశ పర్యటనలో వుండగా (1956)లో రెండేళ్ళ తర్వాత 1958లో భారతదేశంలో ప్రాక్ – పశ్చిమ సమావేశం ఏర్పాటు గురించి స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సమావేశాలను ముందుగా మే 1962లో ఏర్పాటుచేయాలనుకున్నారు. ఆ పిదప నవంబరు 1962కు వాయిదా వేశారు. ఈ సహవాస్ కేవలం బాబా తన ప్రేమికులకు మాత్రమే పరిమితమని బాబా ప్రకటించారు. ఈ సహవాస్ యావన్మంది ప్రజానీకం కోసం కాదన్నారు. ఈ సహవాస్‌లో ఎవరూ తన నుండి ఎలాంటి సహాయం ఆశించవద్దని బాబా హెచ్చరించారు. సహవాస్ అనే పదానికి సమాన అర్థం స్ఫురించేలాగా, నా సహచర భాగ్యంతో ఆనందించమని బాబా తన ప్రేమికులకు పిలుపు ఇచ్చారు. 1962 నవంబరు 1 నుండి ఐదు వరకు జరిగిన ఈ ఐదు రోజుల సహవాస్‌లో, ప్రతిరోజూ ఒక వినూత్న ఆధ్యాత్మిక సందేశాన్ని బాబా తన ప్రేమికులకు ఇచ్చారు. 1962 నవంబరు ఒకటో తేదీ నుండి వరుసగా ఐదవ తేదీ వరకు పూనే గురుప్రసాద్‌లో బాబా సమక్షంలో జరిగిన ప్రతి చిన్న అంశాన్ని పాశ్చాత్య బాబా ప్రేమికులు ఫిల్లిస్ ఫ్రెడరిక్ ముగ్ధమనోహరంగా ది అవేక్‌నర్ , వాల్యూం – 9, నంబరు 1 మరియు 2, 1963లో గ్రంధస్తం చేశారు. ఇది 60 పేజీలు గల చిన్న గ్రంథం. అవకాశం చిక్కితే బాబా ప్రేమికులందరూ ఆంగ్లంలో గల ఒరిజినల్ పత్రిక తప్పక చదవండి!! పై చిత్రంలో ఆ పుస్తక నమూనాను దయచేసి పరిశీలించండి!! వీలువెంబడి ఈ గ్రంధంలోని పలు ప్రధానాంశాలను 'మెహెర్‌బాబా' పాఠకుల కోసం ప్రచురించాలని భావిస్తున్నాం...

సీతమ్మ గారు అన్నారు కదా – కొంచెం భయం వేసింది. ఏ తప్పులు చేశామో, ఏం అంటారో అని. ఇంతలోనే గుండె దిటువు అయింది. ఆ! ఎప్పటికయినా రావల్సిందే కదా! అని అనుకొంటుంటే, బాబా ఆలింగనం దొరికింది, ప్రసాదం ఇచ్చారు అన్నదామె.

బాబా కాళ్ళు కడగడానికి నీళ్ళు తెచ్చారు ఎవరో, ఆ కడిగిన నీళ్ళని మాపై చల్లారు బాబా అని చెప్పింది ఆనందంతో.

ఎన్.వి.వి. సత్యనారాయణ గారి చెవిన బాబా పేరు 1953లోనే పడింది. వెంటనే నమ్మలేదు సరికదా, వ్యతిరేకించారట. 1955 కల్లా పరమ ప్రేమికుడయ్యారు. దర్శనం చేసుకొని ధన్యోస్మి అనుకొన్నాడు.

మెహెరాబాద్‌కి రాలేకపోయిన స్నేహితుడు ఎ.ఎస్. జగన్నాథ్ గారి కథ కూడా వినిపించారీ బ్యాంకర్ గారు. కారు యాక్సిడెంట్ల వల్ల బాబా వంగలేరు. స్ట్రెచర్‌పై వున్న నేను లేచి నమస్కరించలేను. ఏం చేయాలనుకొంటుంటే బాబాయే పరిష్కారం చూపించారు. తమ రెండు పాదాలని నా గుండెలపై పెట్టారన్న జగన్నాథం గారి కథ వింటూంటే ఎవరికీ దక్కని అదృష్టం దక్కించుకొన్న దొడ్డ మనిషీయన అనిపించింది. వినేవారికి కించెంత ఈర్ష్య కల్గిన మాట వాస్తవం.

నోరి సోదరులు – అనుభవాలు గొప్పవే. అన్న హనుమంతరావ్ ఇంగ్లీషులో చెప్పితే, అది తెలుగు సేత చేస్తూ, స్వీయానుభూతులు చెప్పాడు తమ్ముడు సూర్యనారాయణ. ఇంకో తమ్ముడు రామసుబ్బారావ్ వేదిక దగ్గరగా అన్న మాటలకి తల ఊపుతూ కనిపించాడు. ఆరతి అప్పుడు బాబాని చూస్తుంటే, ఈయన దేముడు కాక మరెవ్వరు అనిపించింది అన్నాడు నోరి వారి అగ్రజుడు. వర్షంలో తడిసిన మూడోవాడికి ఆస్మా ఎక్కువవుతుందని భయపడ్డాము అదేమీ కాలేదు అన్నాడు. యాగంటి సుబ్బయ్య గారికి బాబా దర్శనం గురుప్రసాద్‌లో కంటే ముందే జరిగిందిట. అదీ కలలో. ఉరిమి చూస్తున్న భావన కల్గింది కలలో కానీ ప్రత్యక్షంగా చూస్తుంటే అనిర్వచనీయమైన ఆనందం కల్గింది అన్నాడు.

శ్రీమతి లతా విష్ణురావు గారి లిఖిత ప్రసంగంలోని అంశాలను బూర్గుల రామకృష్ణయ్య గారు చదివి వినిపించారు. దర్శనానంతరం బాబావారిని వీడ్కోలు తీసుకొంటుంటే, కలిగిన అనుభవాన్ని పెళ్ళి అయ్యాక ఆడపిల్ల అత్తవారి ఇంటికి వెళ్తుంటే కలిగే మూగ బాధతో పోల్చారు. ప్రొఫెసర్ గాడేకర్ తమ ప్రసంగాన్ని అవతార్ మెహెర్‌బాబా మహా పురుషుడు, సర్వజ్ఞుడు అంటూ మొదలు పెట్టారు. చీరాల రైతుల బృందం బాబా దర్శనానికి రావటం, నిరాశతో వెనుదిరగడం, బాలనాటు ద్వారా వారికి బాబా పిలుపు వెళ్ళడం, దర్శనం దొరకడం సవివరంగా పేర్కొన్నారు. ఈ ఉదంతాన్ని మిగిలిన వక్తలు కూడా గుర్తుచేశారు. నిజమైన ప్రేమకి భాష అడ్డంకి కాదనీ, డబ్బు, హోదా అవసరం లేదనీ, మనస్సు పిలిచే పిలుపు మెహెరుడు ఆలకిస్తాడని పదే పదే చెప్పారు. అయితే, ఆ రైతు బృందం తర్వాతి కాలంలో ఏమయిందీ, ఇప్పుడు వారెవరైనా వున్నారా, ఏం చేస్తున్నారు వాళ్ళు అన్న వైనం

ఎవరికీ తెలియదు. ఎంత గుచ్చి గుచ్చి ప్రశ్నించినా సమాధానం దొరకలేదు. 1962 నాటికి తొమ్మిదేళ్ళున్న రాజ్ ఖిల్నాని ఇప్పుడొక పెద్ద పోలీసు ఆఫీసరు. గురుప్రసాద్ భవంతిని బరోడా మహారాణి మెహెర్ ట్రస్టుకి ఇస్తానంటే, ఆదీ వద్దన్నారట. ఏనుగుని మేపటం ఎంత కష్టమో, ఆ భవనాన్ని జాగ్రత్తగా చూడడమూ అంత కష్టమే అన్నాడట. రాజ్ తండ్రి, ప్రేమ్ గారి చొరవ వల్ల, గురుప్రసాద్ కొన్న కాంట్రాక్టరు, బాబావారి గదిలోని వస్తువులతో స్మారక మందిరం కట్టారు ఓ మూలగా అక్కడే. మధ్యాహ్నం గోష్ఠిలో, దుబాయ్‌లో స్థిరపడ్డ డాక్టర్ కుందా నాఫ్డే, రామచంద్ర గైక్వాడ్, నీరూ పాంచాల్ ప్రభృతులు తమ జ్ఞాపకాలు పంచుకొన్నారు. బాబాకి ఆరతి ఇచ్చిన మహిళల్లో నీరూ కూడా వుంది. వారి తండ్రి ఇంటిలో – చిత్రం రెండవ భాగం ప్రదర్శనతో రెండవ రోజు కార్యక్రమం ముగిసింది.

**మూడవరోజు, నవంబరు 3:**

అమెరికన్ ఆరతి, పశ్చాత్తాప ప్రార్ధనల తర్వాత మెహెర్ ఇంగ్లీషు స్కూలు పిల్లలు బాబావారి నామ గానం చేశారు. రమేష్ జంగ్లీ, ప్రభ జంగ్లీ, మెహెర్ నాథ్, షీలా ఫెన్‌స్టర్, థాడే దంపతులు, మేర్వాన్ రుబాష్, హర్దీప్ హన్స్‌పాల్, కుసమ్ (ఢిల్లీ), ఆమె భర్త మోకమ్ సింగ్, ప్రతాప్ చంద్ర నిగమ్ (హమీర్‌పూర్) వి.డి. పోఫలి (బొంబాయి), హబోబీ దాదాచాన్జీ, జిమ్మీఖాన్ ప్రభృతులు తమ జ్ఞాపకాలని పంచారు.

''నాకు తొమ్మిదేళ్ళప్పుడు'', అంటూ మెహెర్‌నాథ్, బాబావారు తనకిచ్చిన కానుకని చూపించాడు. అదొక హారం. తెలుగువారు బాబాకి వేశారుట. నాకివ్వవా బాబా అంటే

## ఆరోగ్యం బాగోలేదు

1962 నవంబరు 1 నాటికి మెహెర్‌బాబా ఆరోగ్యం బాగాలేదు. ఆరోగ్యం బాగాలేదని అంటే తీవ్రమైన ఈడ్పులు వచ్చేవి. దాదాపుగా 1962వ సంవత్సరం ప్రారంభం నుండీ ఈ మాదిరి ఈడ్పులతో – బాబావారి శరీరం పడుకున్న మంచంపై నుండి ఎగిరి పడినంతగా వుండేది. దీనికి తోడు జ్వరం వుండేది. అప్పటికే బాబా రెండు సార్లు కారు ప్రమాదానికి గురయ్యారు. కుడి కాలు తీవ్ర నొప్పితో బాధవుండేది. ఈ అనారోగ్యానికి కారణం వైద్యులెవరికీ అంతుబట్టలేదు. బాబా ప్రేమికులు డా॥ గోహెర్, డా॥ విలియం డాంకిన్ మాత్రమే వైద్యం అందించారు. వీరు కాకుండా మరెవర్నీ బాబా అనుమతించలేదు.

ఇంతటి విషమ ఆరోగ్య పరిస్థితిలో కూడా బాబా విశ్రాంతి తీసుకోవడానికి ఇష్టపడక తాను నిత్యం చేసే పనులన్నీ యధావిధిగా నిర్వర్తించారు. 1962 అక్టోబరు 21న ఆదివారం నాడు పాశ్చాత్య ప్రేమికులందరి కోసం టెలిగ్రాం పంపారు. ఈ టెలిగ్రాంలోని సారాంశాన్ని పూనేకు వచ్చే తోటి ప్రయాణీకులందరికీ తెలియజేయమన్నారు.

ప్రభువు ఇచ్చారట. వాళ్ళ అత్తయ్యకి ఇవ్వమని బాబావారు తమ చెప్పుల్ని ఇచ్చారుట. మరి నాకేమీ ఇవ్వరా, బాబా అన్నాడు. అంతే హారమనే వరం దక్కింది. అప్పటి బ్యాడ్జీ, – నాదీ మా అమ్మది, ఇంకా పదిలంగా వున్నాయి అంటూ వాటినీ చూపించాడు.

పిలిస్తే తప్ప బాబావారి దగ్గరకి వెళ్ళే వాళ్ళం కాదన్నారు రమేష్, ఆయన సోదరి ప్రభావతి. బాబావారి పిలుపు పైనే 1962 దర్శనానికి వెళ్ళాం. ఇంటి దగ్గర అమ్మ చేసిన వెన్నతో బ్రెడ్ పెట్టేది. కానీ గురుప్రసాద్‌లో కంపెనీ వెన్నతో బ్రెడ్ పెట్టారు. అదే మొదటిసారి బజారులో దొరికే వెన్న తినడం అని తన 10 ఏళ్ళ వయస్సు నాటి జ్ఞాపకాన్ని గుర్తుచేసుకొన్నాడు రమేష్. మేర్వాన్ రుబాష్‌కి పదిహేనేళ్ళ తల్లి తండ్రితో కరాచీలో వుండేవాడు. మేముగ్గురం వాలంటీర్లమేనన్నాడు. చిన్నాడివి నువ్వేం చేస్తావన్నారు. అందుకని చిన్నా చితక పని చెప్పేవారు. టెలిగ్రామ్‌లు పంపడం, బాబావారి దగ్గర మానవహారంలో నిలబడటం – ఇవే చేశాను అన్నారు. అమరతిథి కార్యక్రమాల ప్రయోక్తగా చిరపరిచితమైన థాడేకి బాబావారి శహభాష్ దొరికిందట 1962లో. 13 ఏళ్ళ జిమ్మీ ఖాన్, ఆయన తల్లి దండ్రులు బాబావారికి సన్నిహితులు. గురుప్రసాద్‌లో బాబావారితో పేక ఆడేవాడిని అన్నాడు. ఆరతి ఇస్తుంటే, నా దృష్టి బాబావారి సాద్రాపైనే వుంది. ఎందుకంటే, ఆరతి పళ్ళెం బాబావారికి నాలుగు అడుగుల దూరంలోనే పెట్టి పాడుతున్నారు. అమ్మో ఆరతి మంట సాద్రాని తగిలితేనో అని భయం వేసింది అన్నాడు ఖాన్ గారు. నృత్య నాటకం, కవ్వాలీలు, **'కొత్త సృష్టి ఆవిర్భావం'** (THE BIRTH OF NEW CREATION) అన్న సూఫీల చిత్ర ప్రదర్శనలతో నాటి కార్యక్రమం ముగిసింది. సృష్టి ఆవిర్భావం గమ్మత్తయిన సినిమా. సూత్రధారులు – పురుషులు, స్త్రీ – పాత్రలు 1962 కార్యక్రమంలో వున్నభావన కల్గించి, వారిద్దరి కళ్ళ ద్వారా బాబా సందేశాలు, సృష్టి రహస్యాలు వినిపించారు. చూపించారు. ఇదొక పాశ్చాత్యులు తీసిన సినిమా అనిపించదు చూస్తున్నంత సేపూ.

**నాల్గవ రోజు: నవంబరు 4వ తేదీ:**

ఆఖరి రోజు కార్యక్రమంలో హైలెట్ మన బుర్ర కథ. బాలగోపాల రాజు బృందం బాబావారి సమక్షంలో చెప్పిన కథనే ముగ్గురు ఈతరం వ్యక్తులు – రామచంద్రరావ్, సంగం నాయుడు, మెహెర్ వెంకట్ – వినిపించారు. 'ధన్యులమైతిమిగా, మెహెర్ దర్శన మాయెనుగా పరమాత్మ దర్శనమాయెనుగా, పునర్జన్మల సంస్కార ఫలితమున....సర్వమయుని అండ లభించెన్', అని ఈ ముగ్గురు పాడుతుంటే, ప్రేక్షకులకి 1962 నాటి సన్నివేశం కళ్ళముందు కట్టినట్లు కనిపించింది. సాధారణ బుర్రకథ కళాకారులుగా కాకుండా ఈ ముగ్గురూ మూడు మతాల వ్యక్తులుగా దర్శనమిచ్చారు – ముస్లిమ్‌కు మత పెద్ద మౌల్వీ, క్రైస్తవ మత గురువు ఫాదర్, హిందువుల పురోహితుడిగా వీరు మతాలన్నీ బాబాలో ఒక్కటే అన్న సందేశాన్ని చెప్పకనే చెప్పారు.

శరణు శరణు, శ్రీ మెహెర్ బాబా శరణు షెరియార్జీ పుత్ర ...అన్న మకుటంతో

సాగిన వీరి కథాగానం కేవలం ఇరవై నిముషాలకే పరిమితం చేశారు నిర్వాహకులు. ఏదో సద్గురువు దర్శనంతో కథ ముగిసింది. బాల గోపాలరాజు కథ చెప్తుతుంటే, బాబా వారన్నమాట – నేను కాదు నాలోని పంచ సద్గురువులు మీ కథ వింటున్నారని. కథ చెప్పి, వేదిక దిగి వెళ్ళిపోతున్న బాల గోపాల వారిని బాబా వెనక్కి పిలిపించారట. 'నాతో ఫోటో తీసుకొంటారా' అని ఏరుచ్ ద్వారా అడిగారట. అంతకంటే మాకు కావాల్సిందేముంది దేవ దేవా అన్నారట మన కథకులు. ఈవాళ కూడా అంతే అయింది. రావ్ – నాయుడు – వెంకట్ కథ చెప్పి తెర వెనక్కి వెళ్ళగానే, మళ్ళీ పిలుపు వెళ్ళింది. ఒకసారి వేదిక పైకి వస్తారా ఫోటో తీస్తామన్నారు. సూఫీలు, తరితరులు బుర్రకథకి ముందు సామ్ పటిల్, ఈరుచ్ కపాడియా, ప్రభృతులు తమ అనుభవాలు చెప్పారు. పదకొండు గంటల ప్రాంతంలో, ముర్షీదా కొన్నర్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. స్వర్ణోత్సవాలకి తలమానికంగా ప్రకటించిన ఈ గోష్ఠి ఇతివృత్తం యాభయి ఏళ్ళుగా ప్రాక్, పశ్చిమాలతో వ్యక్తమవుతున్న బాబా కార్యక్రమం. ఎందువల్లనో ఏమో గోష్ఠి అంతగా రక్తి కట్టలేదు. మరో రెండు రూపకాలు, నృత్య ప్రదర్శన, పెయింటింగ్‌లతో స్లయిడ్ షో, సూఫీలు రూపొందించిన సినిమాలతో నాలుగు రోజుల వేడుకలు ముగిశాయి. అతి తక్కువ సేపు ప్రసంగించిన ఘనత ఆలీ రమ్జూ అబ్దుల్లాది. రుద్ధ కంఠములు – రుధిర హృదయములు రచయిత రమ్జూ కొడుకు ఈయన. వేదిక పైకి వచ్చిన ప్రతిసారీ మూడు – నాలుగు మాటలు మించి మాట్లాడ లేదు. "మనం (బాబా ప్రేమికులు) పెద్ద కుటుంబం ఇప్పుడు. బాబా ప్రేమలో పండి తేలాలి మనం" అన్నాడు. సుదీర్ఘ ఉపన్యాసాలు చేసిన ఘనకీర్తి కార్యక్రమ ప్రయోక్త గోకర్ణం శ్రీవాత్సవది. అయితే ఇంగ్లీషు, హిందీలు రెండింటిలో మాట్లాడేవాడు. కాబట్టి "సుదీర్ఘం" తప్పవేమో. ఆయన, ఆయన శ్రీమతి ఉర్మిళ ఈ కార్యక్రమానికి ఊపిరి పోశారు. అయితే సమయపాలన అందరితోపాటు తమకీ వర్తిస్తుందని వారుభయులూ గమనించి వుంటే, స్వర్ణోత్సవ వేడుకలు మరింతగా అందరి హృదయాలనీ హత్తుకొని వుండేవి.

# భైరమంగళలో

కర్నాటక రాష్ట్రంలో బెంగుళూరుకు సమీపంలో గల అవతార్ మెహెర్‌బాబా విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం, భైరమంగళలో కార్యనిర్వాహకునిగా నెల జీతంపై పనిచేయుటకు ఆసక్తిగలవారు తమ వివరాలతో శ్రీ ఏ.రాజగోపాల్, బెంగళూరు ఫోన్..098456–97738 సంప్రదించగలరు.

# సద్గురు జనక మహారాజు

సద్గురు జనక మహారాజు శ్రీరాముని తండ్రి అని (మెహెర్‌బాబా, 2012 అక్టోబరు, పేజీ.10) పొరపాటున తప్పుదొర్లింది. ఇందుకు చింతిస్తున్నాం. **...ఎడిటర్**

# మెహెరస్థాన్ స్వర్ణోత్సవ వేడుకలలో

## విజయనగరం సెంటర్

మెహెరస్థాన్ స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా విజయనగరం జిల్లాలోగల 10 బాబా సెంటర్లు సకుటుంబంగా అక్టోబరు 13,14 తేదీలలో 8వ బాబా సహవాస్‌ను కడు రమ్యంగా, ఉత్సాహంగా నిర్వహించారు.

అక్టోబరు 13న నగర సంకీర్తన, శ్రీ కోడూరి ప్రసాద్ దంపతులుచే బాబా చిత్రపటావిష్కరణ చేశారు. అనంతరం బాబా సందేశాలపై "ఆత్మ ప్రభోధము", ఏకపాత్రాభినయాన్ని శ్రీ ఎల్. రామకృష్ణ (శిఖబడి), 'విశ్వశాంతి' పేరిట మరో ఏకపాత్రాభినయాన్ని శ్రీ జి. అప్పలనాయుడు (పూతికపేట) చక్కగా నటించారు.

విజయనగర కేంద్ర ప్రేమికులచే "అంతర్ముఖుడు" నాటికను కడు రమ్యంగా ప్రదర్శించారు. శ్రీ వల్లూరి నాగేశ్వరరావు రచించిన ఈ నాటకానికి శ్రీ సి.వై. చింతామణి దర్శకత్వం వహించారు. కాగా ఈ నాటికలో శ్రీ హరిమెహెర్, శ్రీ పి. రాజేశ్వరరావు, శ్రీ కె.వి. రమణమూర్తి, శ్రీ కొల్లి సురేష్ కుమార్, శ్రీ కొల్లి రామారావు, శ్రీమతి ఎన్.వి.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ నాటికలో పాత్రధారులు చాలా చక్కగా నటించారని బాబా ప్రేమికులు అభిప్రాయపడ్డారు.

శ్రీ మెహెర్ ప్రసాద్‌రాజు, శ్రీ జల్లు వెంకట మెహెర్, (బొబ్బిలి), శ్రీమతి ఎస్. అనసూయమ్మ శ్రీ డా॥ మంచిపల్లి శ్రీరాములు, శ్రీ చాగంటి అఘోరపతి, శ్రీ బి. అప్పలస్వామి, శ్రీ డి. వెంకటరావు, శ్రీమతి ఎల్. ఉదయ కుమారి తదితరులు బాబా సందేశాలు వినిపించి శ్రోతలను ఆనందంలో ఓలలాడించారు. శ్రీ కొల్లి రామారావు కార్యక్రమాల్ని సమర్థవంతంగా నిర్వహించారు.

**–ఎన్. మెహెర్ శ్రీని, కార్యదర్శి, విజయనగరం**

# మెహెర్‌బాబా ప్రవచనములు

### జూబ్లీ హిల్సులోని బాబా సెంటర్‌లో

**ప్రతి నెలా** – నెల నెలా బాబా ప్రవచనాల కార్యక్రమంలో భాగంగా జూబ్లీ హిల్సులోని బాబా సెంటర్‌లో 25.11.2012, ఆదివారం, ఉ. 10.30 నుండి 12 గంటల దాకా మెహెర్‌బాబా వారి ప్రవచనములపై ఒక ప్రత్యేక గోష్ఠి ఏర్పాటు చేసినట్లు ఆసక్తిగల వారు తప్పక హాజరుకావాలని సెంటర్ కార్యదర్శి శ్రీ రాజేంద్ర మెహెర్ తెలియజేశారు.

# సర్వధర్మాన్ పరిత్యజ్య...




హమీర్‌పూర్ జిల్లాకు చెందిన బాబా ప్రేమికుడు- శ్రీ కేశవ్ నారాయణ్ నిగం తన జీవిత చరిత్రను ఇంగ్లీషులో **మై లైఫ్ స్టోరీ విత్ అవతార్ మెహెర్‌బాబా** పేరుతో 1960వ దశకంలో గ్రంధస్తం చేశారు. ఇంగ్లీషులో వున్న ఈ పుస్తకాన్ని తెలుగులో **సర్వధర్మాన్ పరిత్యజ్య** శీర్షికతో మెహెర్‌బాబా పత్రిక తరఫున ప్రచురించి 2012 జూన్‌లో విడుదల చేయడమైంది.

మేను పులకరింపజేసే అనేక వాస్తవ జీవిత సంఘటనలు ఈ రచనలో కనిపిస్తాయి. కేశవ్‌జీ తన జీవితంలో అనుభవించిన అనేక ఉద్ధాన పతనాలను ఆసాంతం చదివిన పాఠకులు ప్రతి పదంలో తమ కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయని చెప్పారు. బాబా ప్రేమికులందరికీ కేశవ్‌జీ ఆదర్శం. ప్రతిఒక్కరూ తప్పక చదవాల్సిన గ్రంథం, ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం..**సర్వధర్మాన్ పరిత్యజ్య.. వెల..రూ. 50. ప్రాప్తిస్థానం..కేరాఫ్ ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక.**

# హెల్ప్ లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో సికింద్రాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. పత్రిక అందుటలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.

గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను 2013 జనవరి నుండి తొలిగించవలెనని నిర్ణయించడమైంది.

**అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా 2013 జనవరి 31లోగా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి.**

**కానిపక్షంలో 2013 ఫిబ్రవరి నుండి వారు చెల్లించిన నగదును వార్షిక సభ్యత్వం క్రింద జమ చేసుకోవలెనని నిర్ణయించడమైంది.**

**దయచేసి బాబా ప్రేమికులు సహకరించగలరు.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

1929 జనవరి 15న బాబావారి పాదయాత్ర మొదలయింది. ఆలీ అక్బర్, బైదుల్, బువా సాహెబ్, ఛగన్, దారా, ఫేరమ్, కరీమ్, మనేకర్, పెసూ, ప్లీడర్, రుస్తుం, దిన్యార్, మెహెరాబన్‌పూర్, సుబ్బిన్స్, విష్ణు, గుస్తాద్‌గారు, మాసాజీ, బాబావారి తమ్ముళ్ళు - జాల్, బెహ్రాం మొత్తం 18 మంది బాబావారి వెంట కదిలారు. ఛాన్జీ బొంబాయికి ప్రయాణమయ్యాడు. అక్కడ ఏదో పని అప్పగించారు బాబా అతనికి.

పండరీపూర్ మీదుగా కొల్హాపూర్ వెళ్ళాలని బాబావారి సంకల్పం. మొదటి మజలీ అహమ్మద్‌నగర్. నౌసేర్వాన్ సాథా ఇంట - అంటే, అక్బర్ ప్రెస్‌లో రెండు రోజులున్నారు. అక్కడి నుంచి లారీలో డోండ్ చేరారు 17వ తేదీ సాయంత్రానికి. చీకటి పడింది. డాక్ బంగళా ఖాళీగా లేదు. అందుకని డోండ్ రైల్వేస్టేషన్ ఎదురుగా వున్న ఖాళీ జాగాలో ఆ రాత్రికి నడుం వాల్చారు.

18వ తేదీ ఉదయాన్నే బయలుదేరి ఎనిమిది మైళ్ళు నడిచేసరికి పటాస్ గ్రామం వచ్చింది. డాక్ బంగళాలో దిగారు. ఇక్కడి నుంచి కొల్హాపూర్‌కి వద్దు కరాద్‌కి వెడదాము అన్నారు బాబా. సతారా జిల్లాలోని కరాద్ కూడా ఓ పుణ్యక్షేత్రం.

19న ఉషోదయంతోపాటే రోడ్డు పట్టారు. 12 మైళ్ళు నడవగానే రావన్‌గావ్ వచ్చింది. దారిలో బాబావారి కాలు మడతపడింది. పాదం బెణికింది. చీలమండలం దగ్గర నెప్పి మొదలైంది. అయినా లెక్కచేయకుండా నడిచేసరికి, రావన్‌గావ్ చేరేసరికి చీలమండలం దగ్గర బాగా వాచింది. ఈ వాళ్టికి ఇక్కడే వుందామన్నారు. కాస్తంత విశ్రాంతి తీసుకొందామన్నారు. స్థానిక డాక్ బంగళాలో బస చేసారు అందరూ.

20వ తేదీ అర్ధరాత్రి మళ్ళా రోడ్డు పట్టారు, పగటిపూట అయితే ఎండ కదా అందుకని. 11 మైళ్ళు నడిచేసరికి దిక్సాల్ వచ్చింది. సత్రంలో దిగారు. 'గబ్బిలాలం మనం' అన్నాడు జాల్. ఎందుకట? రాత్రిళ్ళు కదా గబ్బిలాలకి కళ్ళు కనిపించేది. మనకి రోడ్డు కనిపించేది అని అతను అంటుంటే అందరూ ఫక్కున నవ్వారు. బాబావారు కూడా నవ్వుల జల్లు కురిపించారు. మర్నాటికి కూడా బాబావారి కాలినెప్పి ఇంకా అలానే వుంది. రెండు రోజులయినా తగ్గలేదు. నడవటం కష్టమేననిపించింది. సరే, ఏంచేస్తాం?

వాపసువెళ్ళిపోదాము అన్నారు బాబావారు. నడవటం కష్టం కాబట్టి, ఇక్కడ నుంచి లారీ మాట్లాడదామన్నారొకరు. సరేనన్నారు బాబా. లారీ దొరికింది.

24వ తేదీన తిరుగుప్రయాణం మొదలైంది. దిక్సాల్ నుంచి డోండ్ వచ్చేసరికి, లారీ చెడిపోయింది. ఇహ లాభంలేదనిపించి రైలు ఎక్కారు. నగర్ చేరారు. అక్బర్ ప్రెస్‌లో ఆ రాత్రికి పడుకొన్నారు.

మర్నాడు మెహెరాబాద్‌కి వాపసు వచ్చారు. అలా ఆ పాదయాత్ర 12 రోజుల్లో ముగిసింది. ఆ వేళ అంటే జనవరి 27వ తేదీ మధ్యాహ్నం స్త్రీ మండలి నాసిక్ నుంచి వచ్చారు. వాళ్ళని తీసుకువచ్చినవాడు మాసాజీ. రెండు మూడు రోజులు బాబాతో వుందామని వచ్చారు వారంతా.

బాబావారి కాలినెప్పి గురించి విన్నారు. గాభరాపడ్డారు. అయితే ప్రభువు మాత్రం ఏమీకానట్లు, ప్రశాంతంగా నిర్మలంగా దర్శనమిచ్చారు. ఇప్పుడు ఎక్కడికీ వెళ్ళను. పాదయాత్రలు ప్రస్తుతానికి చేయను. ఇక్కడే వుంటా కొద్దిరోజులపాటు అన్నారు.

మెహెరాబాద్‌లో జనం తగ్గారు. హడావుడి లేదు. చాలా ప్రశాంతంగా వుంది. ఈ ప్రశాంతం ఎంత కాలమో! సర్వేశ్వరుడికే తెలియాలి. అన్నట్లు ఓ సంగతి చెప్పాలి. బాబావారు పాదయాత్రకి బయలుదేరిన రెండు రోజులకి అంటే జనవరి 17వ తేదీన ఆఘూ ఆలీ మెహెరాబాద్‌కి వచ్చాడు. వాడి కథ షరా మామూలే. బొంబాయి వెళ్ళాక అక్కడ వుండబద్ధిపుట్టలేదట. తల్లికీ, తండ్రికీ చెప్పకుండా ఇంటిలోనుంచి బయటపడ్డాడట. బాబావారు పాదయాత్ర చేస్తున్న సంగతి విని హతాశుడయ్యాడు. ఇంత శ్రమపడి నేను వస్తే, ప్రభువు దూరమయ్యాడా అని బాధపడ్డాడు. బాబావారు వచ్చేవరకూ ఇక్కడే వుంటా ఎక్కడికీ పోను అని భీష్మించాడు. వాడి సంగతి మండలివారికి తెలియకపోతే కదా. వాడి తండ్రి సంగతీ తెలుసు వాళ్ళకి. ఆ మహానుభావుడు మళ్ళీ ఏ కారాలు మిరియాలు నూరతాడో, ఏమో, ముందర కాళ్ళకి బంధం వేస్తే మంచిది అనిపించింది. వెంటనే బొంబాయికి కబురు పంపారు. 'మీ అబ్బాయి మెహెరాబాద్‌కి వచ్చాడు ఏం చేయమంటావ్' అని హాజీముహమ్మద్‌ని అడిగారు. ఏ కళనున్నాడో మహానుభావుడు ఆలీని మీ దగ్గరే వుండనీయండి అన్నాడు. హమ్మయ్య! ప్రస్తుతానికి ఏ గొడవలూ లేవు అని ఊపిరిపీల్చుకున్నారు మండలివారు.

జనవరి 28వ తేదీ బాబాజాన్ జయంతి. దివి నుండి భువికి అవతారుని రప్పించిన పంచ సద్గురువుల్లో ఆమెది ప్రముఖ పాత్ర. మేర్వాన్ నా బిడ్డ అని మురిసిపోయేది. ఆ తల్లి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆరంగావ్ వాసులు భజన చేశారు. భక్తితో పాడుతూ, పాటకు తగ్గ అడుగులు వేస్తూ నాట్యం చేశారు. మూడు గంటలసేపు జరిగాయి ఆ వేడుకలు. కాలేమామ ఇప్పుడు ధూలియాలో వుంటున్నాడు. ఆ ఊరి మున్సిపాలిటీకి ప్రధాన అధికారి. మా ఊరు రమ్మని బాబావారిని చాలాసార్లు పిలిచాడు. వస్తాలే అనేవారు

తప్ప ఇంతవరకు బాబావారు ధూలియాకి వెళ్ళలేదు. ఇంకా ఎంతకాలం నా నిరీక్షణ అని కాలేమామ మధన పడుతున్నాడు. భక్తుని కోరిక ప్రభునికి తప్ప ఇంకెవరికి తెలుస్తుంది. అందుకనే ఫిబ్రవరి 5న ధూలియా యాత్రకి ముహూర్తం పెట్టారు. పెద్ద ఆదీ కొత్త షెవర్లే కారులో బయలుదేరారు. బువా సాహెబ్, జాల్, ఢాకే, షాహనే, విష్ణు కారులో సర్దుకు కూర్చొన్నారు. మధ్యాహ్నానికి మాలేగావ్ వచ్చింది. అది ఢాకే అత్తవారి ఊరు. అతని మామ గారు బాపూ పురానిక్ బాబావారికి అతిధి మర్యాదలు చేశాడు. ఢాకే భార్య పుట్టింటిలోనే వుంది. ఈ మధ్యనే పండంటి బిడ్డకి జన్మనిచ్చింది. 'కమైకర్' అని వాడికి పేరు పెట్టారు. ఆ పసికందుని బాబావారు ఆశీర్వదించారు. బిడ్డడి అదృష్టానికి తల్లి పొంగిపోయింది. సరే తండ్రి ఆనందం గురించి చెప్పనక్కర్లేదు. ఇది అంతా పూర్వజన్మ సుకృతం అనుకొన్నాడు.

మాలేగావ్ నుంచి ధూలియా పెద్ద దూరం లేదు. అక్కడికి చేరేసరికి సాయంత్రమయింది. కాలేమామ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. అవతారుని రాకతో తన ఇల్లు పావనమైందన్నాడు. భక్తితో అంజలి ఘటించాడు. శ్రద్ధగా సకల మర్యాదలు చేశాడు. వెంటవచ్చిన మండలివారికి అతిధి సత్కారాలు చేశాడు. ఆ రాత్రికి బాబావారు అతని ఇంటిలోనే బస చేశారు.

మర్నాడు అందరూ యవలా వెళ్ళారు. నాకు నాసిక్‌లో కొంచెం పని వుంది అని ఆది అంటే, సరే నువ్వు వెళ్ళు అక్కడికి కారులో, మేము రైలులో వెడతాము నగర్‌కి అన్నారు బాబా. ఆదీ నాసిక్ వెళ్ళిన కాసేపటికి రైలు వచ్చింది. నగర్ చేరేసరికి అర్ధరాత్రి అయింది. మెహెరాబాద్ చేరుతూనే, బాబావారు జోపిడీకి వెళ్ళారు. ఇహ 'నా బస ఇక్కడే' అంటూ.

**మహత్యాలు – తాయెత్తులు:**

ఫిబ్రవరి 15వ తేదీ సాయంత్రం అనుకోని సంఘటన జరిగింది. బాబావారు అప్పుడు మండలితో ఇష్టాగోష్ఠి చేస్తున్నారు. రుస్తుం ఓ ప్రశ్నవేశాడు. ముందు వెనుకా ఆలోచించకుండా వేస్తున్నాడీ ప్రశ్న. ఏమయింది ఇతగాడికి అని అనుకొన్నారు అందరూ.

ఇంతకీ రుస్తుం ఏం అడిగాడో తెలుసా?

'ఒక్క మహత్యం చేస్తే చాలు బాబా మీరు. వేలాది మంది మీ పాదాలపై పడతారు. మిమ్మల్ని మ్రొక్కుతారు' అన్నాడు. అవతారుడిని అడగాల్సిన ప్రశ్నే ఇది.

ఈ ప్రశ్నకి అవతారుడు స్పందించాడా! ఏమన్నాడు?

బాబావారు ఏమనలేదు. అసలు విననట్లు తమకి పట్టనట్లు కన్పించారు.

ఇదేమీ రుస్తుం గమనించలేదు. తన ధోరణిలో తానున్నాడు.

బాబా! ఈ రాత్రికి రాత్రి, ఇక్కడ ఓ పెద్ద నిలువెత్తు స్థంభాన్ని సృష్టించండి. ఢిల్లీ కుతుబ్ మీనార్ కంటే ఎత్తుగా వుండాలి. చూడటానికి ఓ అద్భుత సృష్టిలా కనిపించాలి. అలా మీరు చేస్తే, బాబా, నా మాట నమ్మండి, లక్షలాది మంది మీ దర్శనానికి తరలివస్తారు. మానవరూపంలో వున్న భగవంతుడు మెహెర్‌బాబా అని వేనోళ్ళ కీర్తిస్తారు అన్నాడు.

మీరు మీ శక్తిని ప్రదర్శించాలి. ప్రజలు చూడాలి. విస్మయం చెందాలి. మీ శక్తిని కళ్ళారా చూస్తేనే ప్రజలు మీ వెంట వస్తారు. మిమ్మల్ని నమ్మి ఆరాధిస్తారు. మీ అద్భుతశక్తిని ప్రదర్శించకపోతే ప్రజలు ఎలా నమ్ముతారు మిమ్మల్ని అన్నాడు. ఏమో బాబు, నా మనస్సులో మాట చెప్పాను. చెప్పాలనిపించింది చెప్పేశాను. ఇహ బాబావారి ఇష్టం, అన్నట్లుంది అతని వాలకం చూస్తుంటే. ఈ వ్యాఖ్యపై బాబావారి స్పందన రుస్తుం కళ్ళు తెరిపించింది.

ఒక్క రుస్తుం ఏమిటి, ఎందరికో కళ్ళు తెరిపించారు బాబా. ఆనాటి ఉవాచ అన్ని తరాలవారికీ, తరతరాలకీ ప్రేరణ ఇస్తుంది.

సద్గురువులు కానీ, అవతార పురుషుడు కానీ మహత్యాలు చేశారని విన్నావా అని నిలదీశారు. సద్గురువులు మహత్యాలు చేసినా, అవతారుడు మహత్యాలు చేసినా పర్యవసానం చాలా దారుణంగా వుంటుందని చెప్పారు.

నేనేదైనా మహత్యాలు చేస్తే, లక్షలాది మంది దగ్గరకి వస్తారని అంటావు. వాళ్ళంతా ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్ళుతారంటావు. ఒక రకంగా నువ్వు చెప్పిందీ నిజమే. లెక్కలేనంత మంది నా దర్శనానికి వస్తారు. నన్ను సేవించి తరిస్తామంటారు. కానీ వాళ్ళు అందరూ ఎందుకు వస్తారో తెలుసా? ప్రాపంచిక కోర్కెలు తీరుస్తాడు బాబా అని వస్తారు. వాళ్ళకి డబ్బు, దస్కం అవసరం. ఇంత గొప్ప గోపురాన్ని రాత్రికి రాత్రి సృష్టించిన నువ్వు సామాన్యుడివి కావు బాబా. అద్భుత శక్తి సంపన్నుడివి. నీ శక్తిని ఉపయోగించి మా డబ్బు అవసరాలను తీర్చు అంటారు.

ఇంకొంతమంది అయితే వాళ్ళ కష్టాల నుంచి నేను గట్టెక్కించాలని వస్తారు. ప్రాపంచిక బంధనాల నుంచి స్వేచ్ఛ ప్రసాదించమని వస్తారు మరికొందరు. వీళ్ళందరూ ఒక ఎత్తు. భగవన్నామంతో జీవితం గడుపుతున్న వారింకొక ఎత్తు. ప్రాపంచిక సుఖభోగాలకి స్వస్తి చెప్పిన వీరంతా, ఏమి కోరుతారో ఊహించగలరా!

ఈ తపస్సు, ఉపవాసాలు, దీక్షలు వద్దంటానన్న ఆశతోవస్తారు. ఏదో ఒక అద్భుతం చేసి మోక్షం ఇస్తానన్న గంపెడు ఆశ వాళ్ళది. వీళ్ళంతా నా దగ్గరకి ఎందుకు వస్తున్నారు. నా కోసమా? నా పై ప్రేమతోనా? అబ్బే అదేమీ లేదు. వాళ్ళ ప్రేమ అంతా మహత్యాలపైనే. అందుకనే వాళ్ళకి ముక్తి దొరకదన్నారు. ఈ యావత్ ప్రపంచం ఒక భ్రాంతి అన్నారు. ఆ భ్రాంతిలోనే మరో భ్రాంతి మహత్యాలు అని చెప్పారు.

సృష్టికర్త భ్రాంతికి స్వస్తి పలకలేరా! సాక్షాత్తు పరమశివుడైన మెహెర్‌బాబా తమ మూడవ కన్ను తెరిచి భ్రాంతిని భస్మీపటలం చేయలేరా! ఇవన్నీ ప్రశ్నలు. ఈ ప్రశ్నలు దొలిచేస్తున్నాయి అందర్నీ. కానీ బాబావారిని అడగట మెలాగా? బాబావారిని పరంధాముడిగా, సర్వేశ్వరునిగా స్వీకరించిన ఆయన ఉవాచ వినడమే మండలికి తెలుసు. బాబావారు చెప్పిన ప్రకారం చేయడమే తప్ప మరో అలవాటు లేదు. ఎందుకు, ఏమిటీ అని ప్రశ్నించిన సందర్భాలు, దాఖలాలు ఎక్కడోకాని కనబడవు. ఈ దృష్ట్యానే భ్రాంతిపై చర్యని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలో అర్థంకాలేదు. ఈ తికమకల మధ్య, ఎవరో ఆ ప్రశ్న వేయనూ వేశారు.

బాబావారు జవాబు చెప్పనూ చెప్పారు. ఇంతకీ ఎవరు వేశారా ప్రశ్న. ఎవరు వేస్తేనేం! బాబావారు జవాబు చెప్పారుగా. ప్రశ్న ఎవరు వేశారన్నది కాదు కదా ముఖ్యం. బాబావారు ఏం చెప్పారన్నది ముఖ్యం. బాబావారు చాలా సావధానంగా చెప్పారు, చెప్పదలిసిన రెండు సంగతుల్నీ చాలా వివరంగా చెప్పారు. సూర్యుడు, చంద్రుడు, భూమిలో వచ్చే మార్పులు మీ ప్రశ్నకి సమాధానమిస్తాయన్నారు. ముందుగా సూర్యుడు కథ చెప్పారు.

ఆకాశంలో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు సూర్యుడు. ప్రపంచానికి వెలుతురునిస్తున్నాడు. కానీ ఈ సూర్యగోళం పగిలిపోతుంది ఒక రోజుకి. కొన్ని వేల లక్షల సంవత్సరాలకు జరుగుతుంది. అప్పుడేమవుతుంది. ఈ సూర్యుడు అస్తమిస్తాడు. ఇంకో సూర్యుడు ఉదయిస్తాడు అని అంటూ సృష్టి ప్రత్యేకతే ఇది. గతంలో ఏం జరిగిందో మున్ముందూ అదే జరుగుతుంది అన్నారు. రోజు రోజుకీ భూమి చల్లబడుతోంది. భూమి ఎంతగా చల్లబడుతుందీ అంటే, చివరకు భూమి కూడా చంద్రుడిలా మారిపోతుంది, మరి అప్పుడు ఏమవుతుంది, సూర్యుడి విషయంలోలాగా, భూమి విషయంలో కూడా జరుగుతుంది. కొత్త ప్రపంచం వస్తుంది. ఇది పరిణామక్రమం. ఊర్ధ్వ అధోముఖాలుగా జరుగుతుంది పరిణామ క్రమం. అందుకనే గతంలో వున్నదే భవిష్యత్‌లో కూడా వుంటుంది. ఈ ప్రక్రియ ఆగదు. నిరంతరం జరుగుతూనే వుంటుంది. అజ్ఞానం సృష్టితోపాటే వస్తుంది. ఈ రెండూ అంటే అజ్ఞానం, సృష్టి విచిత్రాలు కలిసి వుంటాయి అని చెప్పారు.

అజ్ఞానం, సృష్టి కలిసివున్నట్లే, భ్రాంతి కూడా సృష్టిని వదిలి వుండదు.

సృష్టి – భ్రాంతి చేతిలో చేయి వేసుకుని నడుస్తాయి. ఈ వలయాన్ని ఛేధించడం ఎవరి తరమూకాదు. సృష్టికి ప్రతిసృష్టి చేయలేము కానీ, సద్గురువు కృపకానీ, అవతారుని అండ కానీ వుంటే ఈ మాయా సాగరాన్ని దాటడం తేలిక అవుతుంది. ఈ మాటని బాబావారే శెలవిచ్చారు ఇంకో సందర్భంలో. ఫిబ్రవరి 16వ తేదీన బాబావారి తల్లి తండ్రులు షెరియార్, షిరీన్ మెహెరాబాద్‌కి వచ్చారు. బాబావారి పుట్టినరోజు దగ్గరపడుతోంది కదా. బిడ్డడి జన్మదిన వేడుకలు కళ్ళారా చూసి ఆనందించాలని వచ్చారీ దంపతులు. వచ్చారు కాబట్టి, కుటుంబ విషయాలు మాట్లాడారు. గంటకుపైగా జరిగిందీ మాటామంతీ. ఆవేళ సాయంత్రం బాబావారి జన్మదినం ఫిబ్రవరి 17న ఘనంగా జరిగింది. ఆ వేళ బాబావారు 35వ ఏట అడుగుపెట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పెద్ద అట్టహాసంగా జన్మదినం జరిపారు. నాటి కార్యక్రమ వివరాలు:

ఉదయం 7 నుంచి 8 వరకూ – అందరికీ వేడి వేడి టీ ఇచ్చారు.

నోరు తీపి చేశారు. ఆనాటి తీపి వంటకం రవ్వ కేసరి. ఉదయం 8 నుంచి 10 వరకూ – ఆరంగావ్‌లో పూజ , ఉదయం 10 నుంచి 11 వరకూ – బాబావారికి తలంటి స్నానం,

200 మంది భక్తులచే పాదాభిషేకం. ఉదయం 11 నుంచి 12 వరకూ – బాబావారి జీవితం గురించి . అంగల్ ప్లీడర్‌గారి ఉపన్యాసం, బాబావారికి ఉయ్యాల సేవ. మధ్యాహ్నం 12 నుంచి 2 వరకూ – భోజనం. మధ్యాహ్నం 2 నుంచి 7 వరకూ – కవ్వాలి పాటల

కార్యక్రమం, మధ్యలో కాసేపు టీ విరామం. రాత్రి 7 నుంచి 9 వరకూ – భోజనం. రాత్రి 9 నుంచి – నాటకం, మెహెరాబాద్ నుంచి ఆరంగావ్ వరకూ మేళతాళాలతో బాబావారి ఊరేగింపు. స్థానిక కళాకారులు వేసిన నాటకం బాగా రక్తి కట్టింది. ఊరేగింపు, నాటకం పూర్తి అయ్యేసరికి మూడయింది. అప్పుడు బాబావారు నిద్రకు వెళ్ళారు. అవతారుడిని దర్శించి, పూజించి తరించామన్న తృప్తితో నిద్రకు ఒరిగారు కొన్ని వేల మంది ఆ వేళ. మర్నాడు ఉదయం తొమ్మిదింటికే అందరూ నీళ్ళ టాంకీ దగ్గరకి వచ్చారు. కొండపైన బ్రిటీషువారు కట్టిన టాంకీని గదులుగా మార్చిన సంగతీ, బాబావారు గదుల్లో ఏకాంతవాసం అడపాదడపా చేసిన సంగతి పాఠకులకి తెలుసు. ఈ వేళ ప్రముఖ శాస్త్రీయ గాయకుడు కృష్ణ గారి కచేరీని నీళ్ళ ట్యాంకీలో ఏర్పాటుచేశారు. బాబావారి ముందు కూర్చుని భక్తితో పాడాలని ఎవరికి వుండదు. శాస్త్రీయ గాయకులకయితే తమ విద్యని బాబావారి ముందు ప్రదర్శించాలని, శహభాష్ అనిపించుకోవాలనీ వుంటుంది. కృష్ణగారి విషయంలోనూ అంతే. కచేరీని హాలు నెం. 1 లో పెట్టారు. బాబావారు సుఖాసీనులయ్యాక, కృష్ణ గారు గొంతు విప్పారు. ఏకధాటిన నాలుగు గంటలు పాడారు. బాబావారిని ముగ్ధులను చేశారు. బాబావారికి శాస్త్రీయ సంగీతం అంటే అంతగా ఆసక్తి లేదు. కానీ కృష్ణ గారి శాస్త్ర జ్ఞానం, పాడిన తీరు బాబావారికి బాగా నచ్చాయి. ఆ మాటే చెప్పారు. చక్కటి దుశ్శాలవతో సత్కరించారు.

మహా ప్రసాదమంటూ ఆ కానుకని కళ్ళకు అద్దుకొన్న ధన్యజీవి కృష్ణ గారు. మధ్యాహ్నం మూడింటికి ఓ కవ్వాలీ గాయకుడు వచ్చాడు. అతని పేరు ప్యారు. ఆరు గంటలు పాడాడు. బాబావారికి కవ్వాలీ పాటలన్నా, ఘజల్ అన్నా ఎంతో ఇష్టం. ప్యారు మంచి గాయకుడు. చక్కటి గొంతు అతనిది. పాడుతుంటే మనస్సుకి హాయిగా వుంటుంది. చక్కగా పాడావోయి అని బాబావారు ప్యారు భుజం తట్టారు. ఆ రాత్రి బాబావారు మండలివారికి చెప్పారు ఇహపై దర్శనం ఇవ్వను ఎవరికీ అని. "ఫిబ్రవరి 21వ తేదీ నుంచి దర్శనం వుండదు, వుండదు అంటే వుండదు అంతేనన్నారు". ఈ నియమం అందరికీ వర్తిస్తుందా? అందరికీ కాదు. కాని కేవలం అపరిచితులకే. ముక్కు మొహం తెలీయనివారికి వర్తిస్తుంది. అంటే బాబావారికి కానీ, మండలివారికి కానీ తెలియని వ్యక్తులు వస్తే, వాళ్ళకి బాబావారి దర్శనం దొరకదు ఇహపైన.

ఫిబ్రవరి 21వ తేదీన ఐదుగురిని పిలిచి కొత్త బాధ్యతనప్పగించారు. ఈ అయిదుగురు మండలి సభ్యులు. నేటి నుంచి మీరు రచయితలుగా మారాలి అన్నారు బాబా. ఏదో డైరీలు రాసుకోవడం తప్ప మరేమీ తెలియకపోయినా శివాజ్ఞని కాదంటారా? మీరు చెప్పినట్లే చేస్తామన్నారు. ఇంతకీ ఆ అయిదుగురు కొత్త రచయితలు ఎవరని కదూ మీ ప్రశ్న. అయితే వినండి. దస్తూర్, ఛాన్జీ, రంజూ, మానేకర్, రావ్ సాహెబ్‌లు మన రచయితలు. రావ్ సాహెబ్ పర్షియా నుండి మొన్నామధ్యనే వచ్చాడు. అక్కడికి ఎందుకు వెళ్ళాడో మీకు తెలుసు. ఆశ్రమం స్కూలుని మూసేయాలనుకోవటంతో ఆ దేశపు పిల్లల్ని

ఇంటి దగ్గర దింపిరమ్మని బాబావారే పంపారు. సరే మన అయిదుగురు రచయితలకి తలో ఒక గది కేటాయించారు. వాళ్ళ ఏకాగ్రతకి భంగం రాకూడదు కదా. రచనా వ్యాసంగానికి అవసరమైన పెన్ను, సిరా, కాగితాలు ఇచ్చారు. దస్తూర్‌ని ఇంగ్లీషులో వ్రాయమన్నారు. రమ్జూ అటు హిందీలో, ఇటు ఉర్దూలో అందెవేసినవాడు కాబట్టి, ఆ రెండు భాషలోనూ వ్రాయమన్నారు. పర్షియన్ భాషలో రావ్ సాహెబ్ రచన చేస్తే, గుజరాతీ భాషలో ఛాన్జీ గారు రచన చేయాలన్నారు. మానేకర్ మాతృభాష మరాఠీ కాబట్టి ఆ భాషలోనే వ్రాయమన్నారు. మీరంతా రోజూ నన్ను కలవండి. ఎలా వ్రాయాలి, ఏం వ్రాయాలి చెప్తానన్నారు బాబా. రోజూ మధ్యాహ్నం రెండు గంటలకి మనం కలుద్దామన్నారు. మహదానందంగా కలుస్తామన్నారు మన రచయితలు. వీళ్ళ సంఘానికి బాబావారొక పేరు పెట్టారు. 'దివ్యజ్ఞాన ప్రకాశకులు' వీరు అన్నారు. ఇదంతా బాగుంది కానీ, అప్పట్లో రెండు గంటలకి మీటింగ్ రెండుసార్లే జరిగింది.

ఇహపోతే ఒక్క మానేకర్ ఒక్కడికి ఏం వ్రాయాలో చెప్పారు. రమ్జూ రచన - రుద్ధ కంఠములు - రుధిర హృదయములను మరాఠీలోకి అనువదించమన్నారు. రమ్జూ వ్రాయటమయితే వ్రాశాడు కానీ, ఈ పుస్తకం వెలుగుచూడలేదు. ఇంకా లిఖిత ప్రతిగానే వుంది అప్పటికి. సరే, ఈ అనువాదం అయ్యాక బాబావారి జీవిత చరిత్రని మరాఠీలో వ్రాయాలి. మిగిలిన నలుగురికీ కొత్తగా చెప్పాల్సినది ఏమీ లేదు. ఎందుకంటే, దస్తూర్ మెహెర్ మెసేజ్ పత్రికతో కుస్తీ పడుతున్నాడు కొద్దిరోజులుగా. రమ్జూ ఉర్దూ పేపర్లకి వ్రాస్తున్నాడు. ఛాన్జీగారు ఏమో గుజరాతీ పత్రికలకి బాబా గురించి వ్రాస్తున్నాడు. బాబాపై వస్తున్న విమర్శలని ఖండిస్తున్నాడు. కరపత్రాలు వేస్తున్నాడు. ఇహ రావ్ సాహెబ్ విషయానికి వస్తే, బాబా చరిత్ర పర్షియా భాషలో వ్రాస్తున్నాడు. బాబావారి జీవితంపై పర్షియా భాషలో వస్తున్న మొదటి పుస్తకం అదే. మెహెరాశ్రమం గురించీ, ప్రేమాశ్రమం గురించి కూడా ఆ పుస్తకంలో వ్రాశాడు. **'కాష్ ఫుల్ హకాయక్'** అని పేరు పెట్టాడు. అంటే సత్యదర్శిని అని అర్థం.

-సశేషం

# ఇది అనుసృజన ప్రక్రియ

**తెలుగు మెహెర్ పాఠకలోకానికి మా చిరు కానుకగా సమర్పించిన లార్డ్ మెహెర్ -111 త్వరలో పూర్తికానుంది. ఆంగ్ల రచనకు ఇది పూర్తి నకలు కాదు. అనువాదం కాదు. ఇది అనుసృజన ప్రక్రియలో జరిగిన అనువాదము. తెలుగు పాఠకులకి కథాంశాన్ని సాధ్యమయినంత దగ్గరగా తీసుకురావాలన్నదే మా ప్రయత్నం. అనుసృజనమైనా మూలానికి దూరం కాకుండా జాగ్రత్తపడటమయింది. ఆదరించిన పాఠకులకి, మెహెర్ ప్రేమికలోకానికీ మా జై మెహెర్ బాబా. ...**

**-రాంసింగ్ కల్చూరీ (మల్లాది రామారావ్)**

# వివాహము

శ్రీ శీలా సత్యనారాయణ, శ్రీమతి రాధ గార్ల పుత్రిక చి॥ల॥సౌ॥ శృతి వివాహము 29.11.2012 గురువారము ఉదయం 11.10 ని.లకు చి॥ రాకేష్ తో జి.బి.ఆర్ రాక్ గార్డెన్స్, కె.సి. క్యాంప్ దగ్గర, చింతగట్టు, కరీంనగర్ రోడ్, హన్మకొండ లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి సిర్న జ్యోతి, లక్ష్మీకాంతం గార్ల పుత్రుడు చి॥ సంతోష్ కుమార్ వివాహం చి॥ల॥సౌ॥ అవంతికతో 16.11.2012 శుక్రవారము ఉదయం 11.48 ని.లకు నిజామాబాద్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# అవతార్ మెహెర్‌బాబా కేంద్ర మార్గదర్శిని

రాష్ట్రంలో గల అన్ని బాబా సెంటర్ల సమగ్ర సమాచారంతో "అవతార్ మెహెర్‌బాబా కేంద్ర మార్గదర్శిని" అనే చిన్ని పుస్తకాన్ని ప్రచురించే బాధ్యతను శ్రీ వల్లూరి నాగేశ్వరరావు చేపట్టారు. కాగా ఇంతవరకూ ఈ విషయమై స్పందించని బాబా సెంటర్లు తక్షణం పంపవల్సిందిగా శ్రీ వల్లూరి కోరుతున్నారు. మరిన్ని వివరాలకు శ్రీ వల్లూరి నాగేశ్వరరావు, మెహెర్ ప్రేమ్ కుటీర్, డోర్ నెంబరు–10.1.61, మెహెర్‌నగర్, పాత గాజువాక, విశాఖపట్నం–26 సంప్రదించగలరు.

# చీపురుపల్లి కేంద్రం, 23వ వార్షికోత్సవం

చీపురుపల్లి బాబా కేంద్రం 23వ వార్షికోత్సం సందర్భంగా ప్రత్యేక సహవాస్ కార్యక్రమాన్ని 25.11.2012 ఆదివారం ఉదయం 7 గంటల నుండి మ. 1.15 వరకు ఏర్పాటుచేసినట్లు శ్రీ గొర్లె రమణ, శ్రీ పి. మహేశ్వరరావు ఆహ్వానం పంపారు.

# రాజాం సెంటర్ వార్షికోత్సవం

శ్రీకాకుళం జిల్లా రాజాం సెంటర్ వార్షికోత్సవం అక్టోబరు 14న ఘనంగా జరుపుకున్నామని శ్రీ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ విజయసారధి తాడేపల్లిగూడం, శ్రీ వి. నాగేశ్వరరావు, విశాఖ ఆధ్వర్యంలో మధుర స్మృతులు నాటికను ప్రదర్శించారని శ్రీ రమణమూర్తి తెలిపారు. శ్రీ జి.యల్.ఎన్. గుప్త సప్తవర్ణపతాకావిష్కరణ, మెహెర్‌శ్రీ సంకీర్తనలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఆయనన్నారు.

# నాగరత్నం నిర్యాణం

శ్రీమతి కె. నాగరత్నం (58) ఖమ్మం తీవ్ర గుండెపోటుతో బాబాలో ఐక్యమయ్యారని శ్రీ రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# బాటసారులు

ఈ గ్రంధాన్ని **THE WAYFARERS** -MEHER BABA WITH THE GOD INTOXICATED అని ఇంగ్లీషులో తొలిసారిగా 1948లో పాశ్చాత్య బాబా మండలి ప్రేమికుడు – **విలియం డాంకిన్** ముద్రించారు. ఈ గ్రంధానికి తొలిపలుకులు మెహెర్‌బాబా స్వయంగా రాశారు.

కఠిన మౌనంలో వుండి మన దేశంలో కొన్ని వేల మైళ్ళ దూరం అలుపెరుగక అనేక ఇక్కట్లు ఎదుర్కొని ప్రయాణం చేసి, పిచ్చివాళ్ళ లాగా కనిపించే భగవదున్మత్తులతో మెహెర్‌బాబా నెరిపిన సాంగత్యాన్ని కళ్ళకు కట్టినట్లు ఈ గ్రంధంలో విలియం డాంకిన్ మెహెర్‌బాబా ప్రేమికులందరి కోసం అందజేశారు. కాగా, ఇంగ్లీషులో వున్న ఈ గ్రంధాన్ని బాబా ప్రేమికులు శ్రీ టి. కుటుంబశాస్త్రి గారి కుమారుడు, **శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ**, తెలుగులో అనువదించి – జూన్ 2012లో ప్రచురించారు. బాబా ప్రేమికులు ఎంత కాలంగానో ఎదురుచూస్తున్న ఈ గ్రంధాన్ని ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు, పుస్తక ప్రియులు తప్పక చదవాలి. ప్రతి ఇంటా తప్పక ఉండవల్సిన 800 పేజీలుగా ఉద్గ్రంధమిది.

**పుస్తక ప్రాప్తిస్థానం:** Krishna T.A.C/O Meher Chaitanya Niketan Trust, **TAPESHWARAM - 533 340, East Godavari District.** వెల రూ. **250–00.**

# సప్త వాస్తవాలు




మెహెర్ బాబా ప్రవచనమైన సప్త వాస్తవాలుపై శ్రీ జి. లక్ష్మీనారాయణ తాడేపల్లిగూడెం ఒక సోదాహరణ వ్యాఖ్యానంతో 44 పేజీల చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. సప్త వాస్తవాలు స్వయం ప్రబోధాలన్నారాయన.

ఈ సప్త వాస్తవాల అవగాహనకు బాబా అత్యంత ప్రాధాన్యత ఇస్తానన్నారు గనుక మనం వాటిని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి అని శ్రీ జి.ఎల్.ఎన్ తన ముందుమాటలో ప్రస్తావించారు.

ప్రతి ఒక్కరూ చదవాల్సిన, ప్రతి ఇంటా తప్పక ఉండవల్సిన గ్రంధం సప్త వాస్తవాలు. పుస్తక ప్రతుల కోసం – జి. లక్ష్మీనారాయణ, రిటైర్డ్ టీచర్, 4–50–2బి, మెహెర్ ధామం, సత్యసాయి శివా మందిర్ ప్రక్కన, డి.ఎస్. ట్యాంక్ ప్రక్కన, సుబ్బారావ్ పేట, తాడేపల్లి గూడెం – 534 101, పశ్చిమ గోదావరి జిల్లా. ఫోన్: 98851 20132 సంప్రదించగలరు.

గు.ప్లీ.కృ

గత సంచిక తరువాయి



# గుస్తాద్ జీ

ఆంగ్ల మూలం: **TEARS OF JOY**

**శ్రీ అన్నా ఖండాలే,**
**మెహెరాబాద్.**

**తెలుగు సేత: మల్లాది కృష్ణానంద్**

## గుస్తాద్‌జీ మౌనం

1948 ఏప్రిల్ 1.

మెహెర్‌బాబా మస్తుల అన్వేషణలో బాటానగర్‌కు సమీపంలోని ముకమ్మా ఘాట్ ప్రాంతంలో వున్నారు. ఆ సమయంలో బాబాతోపాటు గుస్తాద్‌జీ తదితరులు వున్నారు. మెహెర్‌బాబా ఆదేశాల మేరకు గుస్తాద్‌జీ చాలా కాలం బాబావారితో పాటు మౌనంగా వున్నాడు.

బాబా మండలి ప్రేమికుడైన ఏరుచ్ బాబావారి సంజ్ఞలను, అలాగే గుస్తాద్‌జీ సంజ్ఞలను అర్థం చేసుకొని వివరంగా చెబుతుండేవాడు. ఈ బాటసారుల పర్యటనలో వున్న సందర్భంలో గుస్తాద్‌జీ బాబాతో సంజ్ఞలతో చెప్తున్న మాటలను దూరం నుంచి పోలీసు కానిస్టేబులు గమనించి, అనుమానంతో వీరి దగ్గరకొచ్చి, తమ వెంట పోలీస్ స్టేషన్‌కు రమ్మనమని ఆదేశించాడు. పోలీసు ఏమనుకున్నాడంటే – వీరేదో **'కోడ్ భాష'** లో మాట్లాడుకుంటున్నారని అనుమానించాడు.

అది చాలా గడ్డు కాలం. భారత స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళు. పాకిస్థాన్ మనకు పొరుగు దేశంగా, వారితో సరైన సఖ్యతలేని రోజులవి. అలాంటి సమయంలో పోలీసు కానిస్టేబులు వీరిని అనుమానించడంలో తప్పేమీ లేదు. కానీ, వీరు అనుమానించదగ్గవారు కాదు కదా! అదే విషయాన్ని ఏరుచ్ చాలా గట్టిగానే పోలీసుతో వాదించాడు. ఐనప్పటికీ అతడ్ని అనుసరించి పోలీసు స్టేషన్‌కు వెళ్ళక తప్పలేదు.

పోలీసు స్టేషన్‌కు వెళ్ళాక తాము పార్శీయులమని, గుస్తాద్‌జీని చూపిస్తూ – ఇతను మూగవాడు, మాట్లాడలేడు కాబట్టి, సంజ్ఞలు చేస్తున్నాడనీ ఏరుచ్ చెప్పాడు.

ఈ విధంగా ఏరుచ్ తనను కించపర్చేలా మూగవాడినని చెప్పడం గుస్తాద్‌జీ ఏమాత్రం ఇష్టపడలేదు. నేను మూగవాడినా? ఎందుకలా చెప్తావ్! నేను బాబా ఆజ్ఞ ప్రకారం మౌనం పాటించడం లేదా? అంటూ ఏరుచ్‌పై ప్రశ్నల వర్షం కురిపించాడు. ఓ ప్రక్కన పోలీసు వాళ్ళు. మరో ప్రక్కన గుస్తాద్‌జీ మూగ రోదన. ఈ రెంటి నడుమ ఏరుచ్ విసుగెత్తి పోయాడు. గుస్తాద్‌జీ పై చికాకు పడ్డాడు.

ఇంతేనా?

ఈలోగా బాబావారు గుస్తాద్‌జీ ఏమంటున్నాడు? అతనేమి చెబుతున్నాడో ముందు నాకు చెప్పి, ఆ తర్వాత వేరే పనేదైనా చేపట్టు, అంటూ మరో ప్రక్కనుంచి బాబా సంజ్ఞలతో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

ఇది చూస్తున్న పోలీసువాళ్ళు, ఒహో! మూగవాడు ఒక్కడు కాదన్న మాట. ఇద్దరున్నారా? అంటూ వారి అనుమానం మరింత ఎక్కువయ్యింది. ఎలాగోలా, పోలీసు వారికి నిజాలను చెప్పి, వారిని నమ్మించి, పోలీసుల బారినుండి బయట పడ్డాడు ఏరుచ్.

అలా బయటకొచ్చాక కూడా ... నన్నెందుకు మూగవాడినని అందరి ఎదుట చెప్తావ్? అని గుస్తాద్‌జీ ఏరుచ్‌ని, ముందు తన ప్రశ్నకు జవాబివ్వమని గుచ్చి గుచ్చి అడుగుతుంటే, నేనా మాదిరి చెప్పకపోతే పోలీసు కస్టడీలో, జైల్లో ఇనుప ఊచలు లెఖ్ఖపెట్టాల్సి వచ్చేదని ఏరుచ్ కొంచెం కఠినంగానే జవాబిచ్చాడు.

ఐతే, ఈ మాదిరి అవమానాన్ని భరించేకంటే జైల్లో ఉండటమే బాగుంటుందని గుస్తాద్‌జీ రపీమని అన్నాడు.

సరే, తన తప్పయింది మహాప్రభూ, మరెప్పుడూ, మరెక్కడా, మిమ్ముల్ని 'మూగవాళ్ళని' – సంభోదించను. ఈ దఫా నన్ను క్షమించి వదిలేయమని, తన తప్పు ఒప్పుకున్నానని ఏరుచ్ అనడంతో గుస్తాద్‌జీ క్షణకాలం మరేమీ ప్రస్తావించ లేదు.

ఐతే, గొప్ప చమత్కారి కదా మెహెర్‌బాబా, ఆయన ఊరుకోలేదు. సరికదా, ఇంకా ఏదో ఒకటి ఇలాగే మౌనంగా సంజ్ఞలతో మాట్లాడుతుండేలా గుస్తాద్‌జీ ఇంకా ఇంకా అన్నట్లు రెచ్చగొట్టారు. వీరిద్దరి సంజ్ఞలను ఒకరికొకరికి అర్థమయ్యేలా చెప్పలేక విసుగుతో ఏరుచ్ నాలిక జారాడు.

ఏమన్నాడో కానీ, ఏరుచ్ మాటతో బాబా తన మనస్సు నొచ్చుకున్నానన్నారు. ఏరుచ్ తన హృదయాన్ని గాయపరిచాడని అన్నారు.

కొన్ని క్షణాల తర్వాత ఏరుచ్ తన తప్పు తెలుసుకొని, క్షమించవల్సిందిగా వేడుకున్నాడు. నేను పొరబాటున ఏమన్నా అది మీ హృదయాన్ని గాయపరచాలని నా ఉద్దేశ్యం కాదని అన్నాడు. అంతేకాదు, ఇంతకన్నా పరుష పదజాలంతో నిన్నెవరైనా అన్నప్పుడు నీవేమీ బాధపడలేదు కానీ నేనేదో చిన్నమాట అనగానే దాన్ని చాలా పెద్ద విషయంగా చేస్తున్నారని, ఏరుచ్ తన మనస్సులోని మాటనన్నాడు. ఈ సమయంలో బాబా ఒక చిన్న కథ చెప్తానన్నారు.

ఒక చిన్న గ్రామంలో ఒక స్త్రీని వ్యభిచార నేరంపై, ఆ దేశ ఆచారం ప్రకారం – గ్రామ నడిబొడ్డున కూర్చోబెట్టి – దారిన వెళ్ళేవారందరిచేత ఒక్కొక్కరు ఒక్కో రాయిని ఆమెపై వేయమని ఆదేశించారు. ఆ దారిన పోయేవారందరూ రాళ్ళతో ఆమెను కొడుతూ ముందుకు వెళ్ళారు.

అదే సమయంలో ఆ దారిన వెళ్తున్న ఆమె సొంత కూతురు తల్లిపై రాయిని విసరలేక, రాజాజ్ఞను ధిక్కరించలేక, చేతిలో వున్న గులాబీ పువ్వును ఆమెను తాకేలా దూరం నుంచి విసిరింది.

కానీ తన కుమార్తె విసిరిన ఆ గులాబీ, ఆ తల్లి హృదయాన్ని ఎంతగానో గాయపరిచింది. ఆమె మనస్సు కల్లోలమైంది. ఎందరో తనపై వేసిన రాళ్ళన్నింటికంటే కూడా గులాబీ చేసిన గాయం తీవ్రమైందని ఆ తల్లి హృదయం వాపోయిందని బాబా అన్నారు.

ఆ రకంగా ఇతరులెందరో ఏం మాట్లాడినా అవి నన్నెన్నడూ గాయపరచలేదు. నీవు అన్న ఆ ఒక్కమాట నన్నెంతో గాయపరిచిందని బాబా అన్నారు.

ఇతరులందరూ ఎలావున్నా నీవు నాకు ప్రత్యేకం అని ఏరుచ్ నుద్దేశించి బాబా అన్నారు.

## కడుపుబ్బ నవ్వులు

ఏప్రిల్ 1948. ఆ రోజున బాబా తన మండలివారితో కలిసి కోల్‌కత్తాకు సమీపంలోని ఒక చిన్న రైల్వేస్టేషన్ దగ్గరున్నారు. రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఆ రోజున థర్డ్‌క్లాస్ భోగీలో ప్రయాణించడం చాలా కష్టంగా వుంది. అందుకని బాబా ఏమన్నారంటే, తనతోపాటు ఏరుచ్, గుస్తాద్‌జీలు మొదటి తరగతి భోగీలోను, మిగిలిన మండలివారందరూ థర్డ్‌క్లాస్ భోగీలో ప్రయాణిద్దామన్నారు.

రైలు రానే వచ్చింది. ఎప్పటిలాగానే రైల్లోకి ఎక్కడానికి పెద్ద తొక్కిసలాట వుంది. ఎలాగో అందరూ ఎక్కారు. ఏరుచ్ వారి సామాన్లు అన్నీ చూసుకున్నాడు. కొన్ని క్షణాల తర్వాత, గుస్తాద్‌జీ ఎక్కడ? అని బాబా ఏరుచ్‌ని అడిగారు.

ఆ భోగీలో గుస్తాద్‌జీ ఎక్కడా కనిపించలేదు. ఆయన ఫ్లాట్‌ఫారం మీదనే ఆగిపోయాడని అందరూ నిర్ణయించుకున్నారు. గుస్తాద్‌జీ వయస్సురీత్యా పెద్దవాడు. అంతేకాక, ఆయన మౌనంగా కూడా వున్నాడు.

రైల్లో అందరూ సర్దుకున్నాక, భోగీలోని టాయిలెట్స్‌కి అడ్డంగాపెట్టిన సామాన్లను తీసి జాగ్రత్తగా సర్ధబోతుంటే ఆ టాయిలెట్‌లో నుండి గుస్తాద్‌జీ బయటకొచ్చాడు.

ఇది చూసి గుస్తాద్‌జీ పై బాబా కోప్పడుతుంటే నాకయితే మూత్రవిసర్జన చాలా తొందర పెట్టింది. ఒక్క క్షణం కూడా ఆపుకోవడం నాచేత కాలేదు. ఇదిగో ఈ సామాన్లన్నింటినీ సర్దుతూ కూర్చుంటే నా పంట్లాం పూర్తిగా తడిసిపోయుండేదన్నాడు. ఈ మాటలు విని బాబా, ఏరుచ్ ఇద్దరూ – కడుపారా నవ్వుకున్నారు.

# అరబ్బీగా గుస్తాద్‌జీ

అహ్మదాబాద్ సమీపంలో బైతుల్లాషా అనే మస్తుతో బాబా కలువనున్నారు.

అది 1948 జూన్ 11వ తేదీ. ఆ రోజున బాబా ఆ మస్తును కలిసారు. ఆ తర్వాత బాబా, ఆయన మండలి వారందరూ తిరుగు ప్రయాణానికై స్థానిక బస్‌స్టాండుకు వచ్చారు. బస్సు వచ్చాక బాబాతో పాటు బైదులు, ఏరుచ్ బస్సు ఎక్కి కూర్చున్నారు. గుస్తాద్‌జీ మాత్రం నడవలేక నీరసంగా వస్తున్నాడు. ఆయనింకా దార్లోనే వున్నాడు. ఇంతలో బస్సు కదలబోతోందని చెప్పి బాబా గుస్తాద్‌జీని కిటికీలోనించి చూసి త్వరగా పరుగున రమ్మన్నట్లు సంజ్ఞ చేశారు. దాంతో గుస్తాద్‌జీ పరుగు మొదలెట్టాడు.

ఐతే ఒక స్కూలు పిల్లవాడు గుస్తాద్‌జీకి ఎదురుగా వస్తున్నాడు. ఆ పిల్లాడు తనను ఎత్తుకెళ్ళడానికి ఎవరో అరబ్బీ వస్తున్నాడని కెవ్వున కేకలు పెట్టడం మొదలెట్టాడు. ఆ రోజుల్లో అరబ్‌లు పిల్లల్ని ఎత్తుకెళ్తున్నారని పెద్ద ఎత్తున పుకార్లు వదంతులున్నాయి.

ఆ మాదిరిగా పిల్లవాడు ఏడుస్తుండటంతో స్థానికులు ఓ పదిమంది గుస్తాద్‌జీని చుట్టుముట్టారు. పాపం, గుస్తాద్‌జీ మౌనంలో వున్నాడు. నోట మాట రాక నిస్తేజంగా ఉండటం చూసి, బాబా దూరం నుంచే భయపడొద్దని సంజ్ఞలు చేశారు. ఆ దరిమిలా బైదులు, ఏరుచ్‌లు బస్సు దిగొచ్చి స్థానికుల్ని సమాధానపరచి గుస్తాద్‌జీని తమతో తీసుకెళ్ళారు.

# గుస్తాద్‌జీని రక్షించారు

అది 1948 నవంబరు మాసం.

బాబా మస్తుల పర్యటనలో గుజరాత్ రాష్ట్రంలో వున్నారు. ఆ సమయంలో బాబా **జునాగఢ్** అనే గ్రామంలో ఏకాంతవాసంలో వున్నారు. గుస్తాద్‌జీ బాబా గది బయట కాపలా వున్నాడు. అర్ధరాత్రి గుస్తాద్‌జీకి మూత్రవిసర్జన చేయవల్సివచ్చింది. బాబా కూడా మంచి నిద్రలో వున్నారన్నట్లు సంకేతంగా ఆయన పెడుతున్న 'గురక' వినపడి, గుస్తాద్‌జీ కాలు ముడుచుకోవడానికి ఉద్యుక్తుడయ్యాడు.

దగ్గర్లోని పిట్టగోడ దాకా వెళ్ళాడు.

సరిగ్గా ఈ సమయంలోనే బాబా పిలుస్తున్నట్లు చప్పట్లు కొట్టారు.

చాలా అర్జంటు అన్నట్లు చప్పట్లు బాబా జోరుగా కొట్టారు.

దాంతో గుస్తాద్‌జీ మూత్రానికి వెళ్ళడం మానివేసి ఒక్క ఉదుటన బాబా ఎదుటకు వెళ్ళాడు. గుస్తాద్‌జీని చూస్తూనే ఎందుకంత ఆలస్యం చేస్తావన్నట్లు కోపంగా చూశారు. గుస్తాద్‌జీ కూర్చున్న చోటనుండి కదలొద్దని ఆజ్ఞలున్నాయి. ఐనా అలా ఎందుకెళ్ళావన్నట్లు బాబా అతనికేసి చూసి, వెళ్ళి కదలకుండా కూర్చోమన్నారు.

కొద్దిసేపయ్యాక తిరిగి బాబా చప్పట్లు కొట్టి పిలిచి, ఇక తనకిష్టమైనట్లు వెళ్ళొచ్చన్నారు. అప్పటికి తెలతెలవారవుతోంది. అప్పుడు గమనించాడు గుస్తాద్‌జీ. రాత్రి కనుక, ఆ చీకటిలో తాను వెళ్ళిన పిట్టగోడ దాటి అడుగు ముందుకేసినట్లైతే, పెద్ద లోతైన లోయలో తాను పడిపోయి వుండేవాడు. ఆ సమయంలో బాబా చప్పట్లుతో పిలిచి తనని రక్షించారని మనస్సులో నమస్కరించుకున్నాడు గుస్తాద్‌జీ.

ఇక్కడ ఇంకొక విషయం గమనించాల్సింది ఏమంటే అవతారుడు గురక పెడుతున్నా ఆయనకి నిద్ర ఏమిటి? ఆయనకి అవగతం కానిది ఏమిటి? అని గమనించాలి!!

# నవజీవనంలో....,

నవజీవనంలో గుస్తాద్‌జీ బాబాతో వున్న సమయమిది.

1949 అక్టోబరు 16 నుండి బాబా నవజీవనం ప్రారంభించారు.

అంతక్రితమే నవజీవనం గురించి చెబుతూ ఆ జీవన పోరాటంలో ఎవరికి, ఏమి జరిగినా, నాకేం సంబంధం వుండదని బాబా అన్నారు.

ఇందుకు గుస్తాద్‌జీ కూడా మినహాయింపు కాదని బాబా అన్నారు.

బాబా ఎందుకిలా అన్నారంటే గుస్తాద్‌జీ బాబాతో చాలా కాలంగా వున్నారు. అంతేకాదు, ఆయన షిరిడి సాయిబాబా దగ్గర, ఆ తర్వాత సాకోరీ, ఉపాసనీ మహారాజ్, పూనేలోని బాబాజాన్‌లకి తన సేవలు అందించాడు.

అలాగే, మెహెర్‌బాబా దగ్గరకి గుస్తాద్‌జీని ఉపాసనీ మహారాజ్ స్వయంగా పంపారు. ఇన్ని ప్రత్యేకతలున్న గుస్తాద్‌జీకి కూడా నవజీవనంలో ఎలాంటి మినహాయింపులుండవని బాబా స్పష్టం చేశారు.

ఈ నవజీవనంలో బాబాతో పాటు ప్రయాణించేవారందరూ వారివారి పాత అలవాట్లకు స్వస్తి పలకాలని బాబా ఆదేశించారు.

ఇదిలా వుంటే, నవజీవనంలో భాగంగా జల్గాంలో ఉండగా గుస్తాద్‌జీ తాను పడుకున్న ప్రక్క చుట్టూతా హద్దులు సూచిస్తూ గీతలు గీసి వుండటం చూసి, ఆ పాత అలవాట్లు మానుకోమని బాబా సూచించారు.

ఈ గీతల వల్ల ఎవరికీ అపకారం జరగదు అని గుస్తాద్‌జీ అంటే, నేను ఏదో అపకారం జరుగుతుందనే భావిస్తున్నానన్నారు బాబా.

అలాగయితే నేటితో ఇలాంటి పనిని తిరిగి చేయనని గుస్తాద్‌జీ జవాబిచ్చారు.

# బంగారు గడియారం

1952లో మెహెర్‌బాబా అమెరికా తదితర విదేశాల పర్యటనకు వెళ్ళారు. బాబా మండలితో పాటు గుస్తాద్‌జీ కూడా ఆ పర్యటనలో వున్నాడు. ఎప్పుడూ చిరిగిన కోటూ

చొక్కా ధరించే గుస్తాద్‌జీ, ఈ పర్యటనలో మంచి సూటు, బూటు, టై కట్టుకుని అధికార దర్పంతో విదేశాలలో పర్యటించాడు. బాబా మండలి సభ్యుడైన మెహెర్‌జీ కర్కారియా ఈ పర్యటనలో గుస్తాద్‌జీని ఒక గడియారపు షాపులోకి తీసుకెళ్ళి, ఆయనికి ఇష్టమై ఎంచుకున్న ఒక బంగారు గడియారాన్ని కొనిచ్చాడు.

ఆ దరిమిలా మెహెరాజాద్‌కు తిరిగి వచ్చాక గుస్తాద్‌జీ యథాప్రకారం తన కిష్టమైన రీతిలో తన చిరిగిన చొక్కా పంట్లాంలను ధరించాడు.

అమెరికాలో కొన్న బంగారు వాచీని, సూటు-బూటూ గట్రా అన్నీ తన గదిలో ఓ ట్రంకు పెట్టెలో భద్రంగా దాచిపెట్టాడు. ఆ అపురూపమైన బంగారు వాచి ఎవరి కంట పడకుండా జాగ్రత్త పడేవాడు.

ఐతే, ఒక రోజున ఏరుచ్ సోదరుడు మేర్వాన్ మెహెరాజాద్‌కు వచ్చాడు. బాబా గుస్తాద్‌జీని పిలిచి మేర్వాన్ చాలా రోజుల తర్వాత ఇక్కడకు వచ్చాడు. నీవు అమెరికాలో కొన్న వాచీని అతనికి చూపించావా? అని అడిగారు. చూపించలేదన్నాడు గుస్తాద్‌జీ. ఐతే ఆ వాచీని తప్పక మేర్వాన్‌కు చూపించమన్నారు బాబా.

గుస్తాద్‌జీ వెంటనే బాబాకు రెండు చేతులతో నమస్కరిస్తూ ఆ గడియారం గురించి గట్టిగా ఏమనొద్దు.

అందరికీ ఆ వాచీ గురించి తెలియకూడదన్నాడు. మెహెర్వాన్‌కు మాత్రం తాను తప్పకుండా ఆ గడియారాన్ని చూపిస్తానన్నాడు.

బాబా కూడా రహస్యాన్ని పాటిస్తున్నట్లు నెమ్మదిగా, నేనెవరితోనూ దాని గురించి చెప్పను. అటూ ఇటూ చూస్తూ మరింత రహస్యంగా మెహెర్వాన్‌కి మాత్రం చూపించు. ఆ గడియారానికి వున్న అలారం, అది చూపించే వారం, తేదీ, ఇతర వివరాలు అన్నీ చూపించమన్నారు. ఎవరూలేని సమయంలో నిన్ను పిలిచి, ఆ వాచీని గుస్తాద్‌జీ చూపిస్తాడని బాబా మేర్వాన్‌తో అన్నారు.

కొద్ది సేపయ్యాక గుస్తాద్‌జీ మేర్వాన్‌ని తన గదికి పిలిచాడు.

అతను లోపలికి వస్తుంటే బయట ఎవ్వరూ చూడలేదు కదా! అని అటూ - ఇటూ బాగా చూసి, మేర్వాన్‌ని లోనికి పిలిచి తలుపుకు లోపల నుండి గడియ వేశేశాడు. ఆ గదికున్న కిటికీని మూసేసాడు. గుస్తాద్‌జీది చాలా చిన్న గది.

అది కూడా చిందర వందరగా చిత్తు కాగితాలతో, ఏరుకొచ్చిన పాత వస్తువులతో, సిగరెట్ పీకలతో, గందరగోళంగా వుంటుంది.

గుస్తాద్‌జీది అంతా ఒక విలక్షణ వ్యక్తిత్వం. లోపలికి వెళ్ళిన తర్వాత కూడా ఎవరూ చూడట్లేదని గమనించాక, నింపాదిగా గుస్తాద్‌జీ తన ట్రంకు పెట్టె తెరవబోయాడు. ఇంతలో ఎవరో బయట అలికిడయ్యింది. వెంటనే ఆ పెట్టెను మూసేశాడు. బయట్నించి ఎవరో తలుపుకొడుతుంటే, కోపంగా వెళ్ళి తలుపు తెరచిచూస్తే ఏముంది? బాబావారు

గుమ్మం ఎదుట నిల్చున్నారు.

బాబా గదిలోకి వస్తూనే మేర్వాన్‌కి ఆ గడియారం చూపించావా? అని అడిగారు.

ఇంకా లేదు బాబా! అదే చేస్తున్నాను. ఇంతలో నీవు వచ్చావంటూ బాబా ఎదురుగానే మేర్వాన్‌కు ఆ గడియారాన్ని చూపించాడు.

మేర్వాన్ ఆశ్చర్యంతో ఆనందంతో చూశాక,

నీవు ఇక్కడ్నుంచి ఎలాంటి చప్పుడూ చేయకుండా నేరుగా నీ గదికి వెళితే, నా సామాన్లు అన్నింటినీ సర్దుకుంటానని చెప్పి మేర్వాన్ని జాగ్రత్తగా తన గది నుంచి పంపించేశాడు గుస్తాద్‌జీ.

## క్రొత్త కారులో పాత కాగితాలు

గుస్తాద్‌జీది ఒక విలక్షణ మనస్తత్వం అని చెప్పుకున్నాం కదా!!

పాత కాగితాలు, ఖాళీ సిగరెట్ పెట్టెలు, ఇలా ఒకటేమిటి చెత్తా - చెదారాన్నంతా బజార్ల నుండి ఏరుకొచ్చి,

బస్తాల్లో నింపుతుంటాడు. వాటిని ఏరుచ్ చెల్లెలు మెహ్రూతో పాతసామాన్లు కొనే దుకాణాల్లో అమ్మించేవాడు.

బాబా సతారాలో ఉన్నారు. ఆ సమయంలో తన దగ్గరున్న చెత్తని అమ్మడానికి గుస్తాద్‌జీకి చాలా రోజులపాటు కుదరలేదు.

సరిగ్గా ఈ సమయంలోనే బాబావారి శిష్యుడు మరియు కార్యదర్శి ఆదీ-కె-ఇరానీ తాను కొత్తగా కొన్న కారుని బాబావారికి చూపిద్దామని సతారాలోని గెస్ట్‌హౌస్‌కి వచ్చాడు.

ఆదీని అతని కొత్త కారుని చూసిన గుస్తాద్‌జీ తనకొక చిన్న సహాయం చేయాలని, కొన్ని పాత కాగితాలున్న బస్తాల్ని మెహ్రూకి అందజేయాలని కోరాడు.

ఆదీ బాబాతో సమావేశమైన సమయంలో గుస్తాద్‌జీ తన దగ్గరున్న ఆ పాత కాగితాలు చెత్తా చెదారాలతో నింపిన గోనె సంచుల్ని ఆదీజీ క్రొత్తకారు నిండా నింపేశాడు.

ఇది గమనించిన ఆదీ కోపంతో ఆ బస్తాలన్నింటినీ తీసేసి బడటపడవేశాడు.

ఆ పాత కాగితాల బస్తాలను తన క్రొత్త కారులో తీసుకెళ్ళడం కుదరదని గుస్తాద్‌జీతో ఖరాఖండీగా చెప్పాడు.

పాపం! గుస్తాద్‌జీ మనస్సు నొచ్చుకున్నాడు. మనస్సులో బాధపడుతుంటే, గదిలో నించి బయటకొచ్చిన బాబా ఆదీని అడిగి జరిగిన సంగతంతా తెలుసుకున్నారు.

నీవు ముందుగా గుస్తాద్‌జీకి పాత బస్తాలు నీ కారులో తీసుకెళ్తానని మాట ఇచ్చావు కాబట్టి ఆడిన మాట తప్పడం మంచిది కాదని బాబా హెచ్చరించారు. దాంతో మరో మార్గం లేక క్రింద వేసిన ఆ గోనె సంచులన్నింటినీ తిరిగి తన క్రొత్త కారులో వేసుకుని తనతోపాటు తీసుకెళ్ళాల్సి వచ్చింది.

# అవతారుని చమత్కారం

బాబా సతారాలో ఉంటున్న రోజులవి!!

గుస్తాద్‌జీ తనకేదో జ్వరం వచ్చిందని, తలనొప్పిగా భారంగా ఉందని, కదలక మెదలక ఉన్నాడు. ఇదంతా ఓ నాటకమని గమనించిన బాబావారు మరో హాస్యాన్ని పండించారు.

బాబా మండలి సభ్యుడైన కాకాబారియా మెహెరాజాద్‌లోనే ఉంటున్నాడు. అతను ఏరుచ్‌కి ఒక ఉత్తరం రాశాడు.

ఆ లేఖలో ఏమని రాశాడంటే, డెహ్రాడూన్ నుంచి బాబా ప్రేమికుడైన క్రిష్ణస్వామి అనే అతను మెహెరాజాద్‌కి వచ్చాడు. తీవ్ర చలికాలం కావడంతో అతను చలికి వణికిపోతుంటే చూడలేక, గుస్తాద్‌జీ గదిలోకి వెళ్ళి,

అతని ట్రంకు పెట్టె తాళం తెరచి అందులో వున్న ఉన్ని దుస్తులు క్రిష్ణస్వామికిచ్చాను. క్రిష్ణస్వామి చెప్పిన మాట ప్రకారమే గుస్తాద్‌జీ పెట్టె తెరిచి, అతనికి ఆ ఉన్ని దుస్తులు ఇచ్చానని కాకాబారియా ఆ లేఖలో రాశాడు.

ఏరుచ్ ఈ లేఖను గుస్తాద్‌జీ బాబావారి సమక్షంలో గట్టిగా చదివి వినిపించాడు. దాంతో గుస్తాద్‌జీ చిర్రెత్తిపోయాడు. అతనెవరు నా పెట్టె తెరచడానికన్నాడు.

కథకళీ ఆడేశాడు. కోపంతో పొగలు క్రక్కుతూ వరండాలో అటూ ఇటూ పచార్లు చేశాడు.

అగ్నికి ఆజ్యం పోసినట్లు కాకా నీ పెట్టె తెరిచాడంటే అది దొంగతనంతో సమానమేనని బాబా గుస్తాద్‌జీతో అన్నారు.

దాంతో గుస్తాద్‌జీ మరింత రగిలిపోయాడు. వరండాలో పెద్ద పెద్ద అంగలుతో ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో వేడి వేడి గాలులు వదులుతూ తనని తక్షణం మెహెరాజాద్‌కు వెళ్ళేందుకు అనుమతించాలని బాబాని కోరాడు.

తాను మెహెరాజాద్‌కి వెళ్ళి కాకా గొంతు నులిమి చంపేస్తానని ఆ తర్వాత సతారాకొస్తానన్నాడు గుస్తాద్‌జీ.

ఇదంతా చూస్తూ బాబా తనలో తానే నవ్వుకుంటున్నారు.

గుస్తాద్‌జీ కోపం తారాస్థాయికి చేరుతుంటే అతడి కోపాన్ని తగ్గించడానికై అన్నట్లు ఏరుచ్ చేతిలోని లేఖను చూపిస్తూ, ఆ లేఖపై వున్న పోస్టలు స్టాంపును చూడమన్నారు.

ఆ లేఖ ఇక్కడే సతారాలో పోస్టు చేశారని చెప్పారు.

ఆ లేఖ కాకా నుంచి వచ్చిందికాదని చెప్పారు.

హాస్యం కోసం చేసిన నాటకమనీ తెలియజెప్పారు.

ఏమైతేనేం – గుస్తాద్‌జీ దొంగ జ్వరం దూరమయి అంతా నయమయిందని అందరూ కడుపారా నవ్వుకున్నారు.

# అవతారుని అనుబంధం -గుస్తాద్‌జీతో

1950 నవంబరు మాసం.. .... ఒక సందర్భంలో బాబా తన మండలివారితో మాట్లాడుతూ - రాబోయే రోజుల్లో తాను చేపట్టబోయే ***FIERY FREE LIFE*** గురించి చెప్పారు.

ఆ సమయంలో ఉపాసనీ మహారాజ్ తన గురించి ఏమని చెప్పారో తిరిగి చెప్పమని బాబా గుస్తాద్‌జీని కోరగా - గుస్తాద్‌జీ ఇలా వివరించారు.

నాకు సాయిబాబా ఏమి అనుగ్రహించారో, అదంతా నేను మేర్వాన్‌కు అందజేశాను. నా దగ్గరున్న ఆ తాళం చెవిని మేర్వాన్‌కు అందజేశాను కాబట్టి ఇకపై నీవు మేర్వాన్‌కు విధేయుడివై అతడిని అనుసరించమని ఉపాసనీ మహారాజ్ తనను ఆదేశించినట్లు గుస్తాద్‌జీ మండలి ఎదుట బాబావారి ఆదేశాల మేరకు వివరించాడు.

ఆ దరిమిలా బాబా మాట్లాడుతూ...At present I am bent upon doing or dying. If my body lasts until the end of April 1953, it is well and good. Ninety Nine percent, I feel that my body will not fall and in that case, I will surely think of Gustadji. Indeed his longing love and patience stand beyond measure .. ...

గుస్తాద్‌జీ గురించి బాబా ప్రస్తావిస్తూ, నా ఆదేశాలు పాటిస్తూ 1919 ప్రాంతంలో పూనేలో గుస్తాజీ సుమారు 6 నెలలపాటు కేవలం మంచినీళ్ళు త్రాగి ఉపవాసం వున్నాడన్నారు. రాత్రిళ్ళు బాబాజాన్‌కి ప్రక్కనే కూర్చోమని నేనాయన్ని ఆదేశించానన్నారు. రాత్రిళ్ళు నిద్ర పోకుండా సుమారు మూడు సంవత్సరాలున్నాడాయన. ఆలాగే, పగటిపూట పూనేలో కల్లు దుకాణంలో పనిచేశేవాడు. ఒక్క పైసాపెట్టి కూరగాయలు కొని, వాటిని వుడికించుకుని ఉప్పులేకుండా తినేవాడు గుస్తాద్‌జీ అని బాబా గుస్తాద్‌జీని ప్రస్తుతించారు.

**- ఈ శీర్షిక ముగింపు వచ్చే సంచికలో.,**

# వధువు- వరుడు కావలెను

పేరు: మెహెర్ హరీష్, (యం.సి.ఎ, బి.ఎస్.సి, బి.ఇ.డి & హార్డ్‌వేర్), పుట్టిన తేది: 15.05.1984 (27 సం॥), నక్షత్రం: నక్షత్రం-అనూరాధ, 3వ పాదం, గోత్రం: తామర గర్భ బ్రహ్మర్షి, కులం: విశ్వబ్రాహ్మణ, ఉద్యోగం: సర్వీస్ ఇంజనీర్, శ్రీకాకుళం.

పేరు: మెహెర్ ప్రశాంతి (యం.ఎస్.సి), పుట్టిన తేది: 02.02.1991 (21 సం॥) రంగు: చామనచాయ, ఎత్తు: 5.3, నక్షత్రం: ఉత్తర, 3వ పాదం, గోత్రం: తామర గర్భ బ్రహ్మర్షి,, కులం: విశ్వబ్రాహ్మణ. తండ్రి - శ్రీ జి.యస్. ప్రకాశరావు, శ్రీకాకుళం.

ఫోన్ నెం. 99087 42466.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అన్నతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2012** అక్టోబర్ – నవంబరు నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | నవంబరు | కోటేష్ గౌడ్, కరీంనగర్ | 500.00 |
| 2. | నవంబరు | రాజేందర్, కరీంనగర్ | 500.00 |
| 3. | నవంబరు | సి.ఎస్. శాస్త్రి & కో. | 1000.00 |
| | | **మొత్తం** | **2000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500087. ఫోన్:99595–53218, email: malladisukku@gmail.com**

# మెహెరాబాద్ అభివృద్ధికై

మెహెరాబాద్ అభివృద్ధికై బాబా ట్రస్టుకు విరాళాలు అందజేయవల్సిందిగా ట్రస్టు చైర్మన్ భావూ కల్చూరీ ఒక ప్రకటనలో కోరారు. డొనేషన్లు ఆన్‌లైన్ బ్యాంకు అక్కౌంటు –Bank of Maharashtra, M.G. Road Br. Ahmednagar (M.S) SB Account No. 20098450037, IFSC code MAHB0000024 ద్వారా ఆన్‌లైన్‌లో పంపవల్సిందిగా కోరుతున్నారు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**